ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 8 నవంబరు 2025



వందేమాతరం..
మహత్తర గేయం

● 150 ఏళ్ల వేడుకలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



కలెక్టరేట్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా అధికారులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సంగ్రామంలో భారతీయులను ఏకతాటిపైకి తీసుకొచ్చి, స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన మహోన్నత దేశభక్తి గీతం వందేమాతరం అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శంకరన్ హాల్లో కలెక్టర్‌తో పాటు, జిల్లా అధికారులు, సిబ్బంది వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా వందేమాతరం గేయాన్ని ఆలపించి, ఆ గేయం గొప్పతనాన్ని, కీర్తిని మరోసారి గుర్తుకు తెచ్చుకుంటున్నామని చెప్పారు. ఈ గేయం యావత్ భారతజాతిని సంఘటితం చేసి, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలకపాత్ర పోషించిందని చెప్పారు. మతాలు, భాషలు, ప్రాంతాలు వేరైనా మనమంతా భారతీయులమనే విషయాన్ని గ్రహించి, అందరం ఐకమత్యంతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, కలెక్టరేట్ ఏవో తమ్మా విజయకుమార్, మత్స్యశాఖ జేడీ శాంతి, ఐఅండ్‌పీఆర్ డీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీఈ శివశంకర్, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో..

నెల్లూరు(క్రైం) : స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిన వందేమాతరం గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల మాట్లాడుతూ వందేమాతరం కేవలం ఒక గేయం మాత్రమే కాదని, దేశస్వాతంత్ర్య సంగ్రామంలో కోట్లాది మంది భారతీయుల హృదయాల్లో స్ఫూర్తిని రగిలించిన జాతీయగీతమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు జీ. శ్రీనివాసరావు, చంద్ర మోహన్, ఏవో చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో వందే మాతరం గేయాన్ని ఆలపిస్తున్న పోలీసులు

● వందేమాతరం గీతం దేశభక్తిని నింపింది..

నెల్లూరు (జడ్పీ) : వందేమాతరం గీతం మనలో దేశభక్తి, త్యాగం, ఐక్యత అనే విలువలను నింపిందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. వందేమాతరం గేయం 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం జడ్పీ కార్యాలయంలో ఇన్‌చార్జి సీఈవో శ్రీధర్‌రెడ్డితో కలిసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందేమాతరం అనే మాట పలికినప్పుడు భారతీయుల్లో ఒక శక్తి, గర్వం, ఆత్మవిశ్వాసం ఉద్భవిస్తుందన్నారు. అనంతరం జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది అందరూ కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు.



జిల్లాలోని కొన్ని కీలక సమస్యలను పలు సమావేశాల్లో చర్చిస్తున్నా, వాటికి పరిష్కారం మాత్రం దొరకడంలేదు. ఈ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ఆదేశించడం...ఆ తర్వాత వాటిని పట్టించుకునే పరిస్థితి యంత్రాంగంలో కనిపించకపోవడం ఆనవాయితీగా మారింది. కీలకమైన బ్యారేజీల నిర్వహణ, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ, నెల్లూరులో ఫ్లైఓవర్ల నిర్మాణం, లస్కర్ల నియామకం, ప్రాజెక్టులకు భూసేకరణ... వంటివి సుదీర్ఘకాలంగా తిష్టవేసిన సమస్యలు. వీటి పరిష్కారానికి ఆదేశాలు ఒక్కటే చాలదని, ఆ తర్వాత ఫాలోఅప్ కూడా ఉంటేనే ఫలితం ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. ఈ క్రమంలోనే మరోమారు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ(డీఆర్సీ) సమావేశం నిర్వహించనున్నారు.



నెల్లూరులోని కొండాయపాలెం రైల్వేగేటు వద్ద వేచి చూస్తున్న వాహనదారులు

మాటలు కాదు..
ఆచరణ కావాలి!

● నేడు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం
● ఆ వెంటనే ఐఏబీ నిర్వహణకు ఏర్పాట్లు
● పలు సమస్యలకు ఏళ్ల తరబడి దొరకని పరిష్కారం
● గత సమావేశాల్లోనూ వివిధ అంశాల ప్రస్తావన
● ఇప్పటికీ ఎక్కడి గొంగళి అక్కడే...

నెల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన శనివారం ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ దఫా కూడా పలుశాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. అయితే ఈ సారైనా దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

● బ్యారేజీల నిర్వహణ గాలికి..

సంగం, నెల్లూరు బ్యారేజీల నీటిని కాలువలకు మళ్లిస్తూ ఆయకట్టును సాగు చేస్తున్నారు. ఈ రెండు బ్యారేజీలను రూ.500 కోట్లతో నిర్మించారు. అయితే వీటి నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో పనులు పూర్తికాకుండా బ్యారేజీలను ప్రారంభించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ అదే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. ఈ రెండు బ్యారేజీల వద్ద ఉన్న గేట్లను ఎత్తేందుకు, దించేందుకు ఒక్కరంటే ఒక్కరు కూడా టెక్నికల్ ఆపరేటర్ లేరు. ఇటీవల సగం బ్యారేజీ వద్దకు పెద్ద బోట్లు వరదలో కొట్టుకొచ్చిన సమయంలో కావచ్చు.. నెల్లూరు బ్యారేజీ వద్ద కార్తీకమాసం సందర్భంలో నీరు విడుదల చేయాల్సిన సమయంలో కావచ్చు... గేట్ల ఆపరేటర్లు లేక డీఈ, జేఈలే ఆ పనిచేయాల్సి వచ్చింది.

● సర్వేపల్లితో పొంచి ఉన్న ప్రమాదం

రెండు రోజుల క్రితం తిరుపతి జిల్లాలో ఓ చెరువుకు గండిపడడంతో ఓ దళితవాడ మొత్తం మునిగిపోయింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం లేకపోయినా, భారీగా ఆస్తి నష్టం జరిగింది. అంతటి చిన్న చెరువుకు గండిపడితేనే ఆ పరిస్థితి ఉంటే.. ఇక 1.73 టీఎంసీల సామర్థ్యం కలిగిన సర్వేపల్లి రిజర్వాయర్‌కు గండి పడితే జరిగే ప్రమాదాన్ని ఊహించుకోవడం కూడా కష్టం. సుమారు పది గ్రామాలపై ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అంతటి ప్రాముఖ్యమైన సర్వేపల్లి రిజర్వాయర్ కట్టలు బలహీనంగా మారాయి. 2015లోనే ఓసారి గండిపడడంతో అప్పుడు ఇసుక బస్తాలతో సర్దుబాటు చేశారు. గత డీఆర్సీ సమావేశంలోనూ ఈ అంశంపై చర్చ జరగ్గా, వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని మంత్రులు ఆదేశించారు. అయితే రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు వెళ్లినా ఇంతవరకూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోలేదు.

● నెలరోజులైనా దిక్కులేదు...

జిల్లాలో తీవ్రంగా దెబ్బతిన్న 18 ప్రధాన రోడ్లను బాగు చేసేందుకు ప్రభుత్వం రూ.73.40 కోట్లతో నెల క్రితం అనుమతులు మంజూరు చేసింది. అప్పటికే దారుణంగా దెబ్బతిన్న ఆ రోడ్లు.. ఇటీవల మొంథా తుఫాన్‌తో మరింత గుంతలుగా మారిపోయాయి. అయితే దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న మాదిరిగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, ఇప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవలేదు. కేవలం మూడు వర్కులకు మాత్రమే టెండర్లు పిలిచారు.

● నగరవాసులకు నరకం

ఒకటి కాదు, రెండు కాదు.. దాదాపు ఎనిమిదేళ్ల నుంచి నెల్లూరు నగరంలో రైల్వే బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభమవుతుందన్న ప్రచారం తప్ప ఆచరణ కనిపించడంలేదు. గతిశక్తి పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందటే ఈ రైల్వే ఫ్లైఓవర్ల నిర్మాణానికిపై బడ్జెట్ కేటాయించింది. అప్పుడప్పుడు అధికారులు మీటింగ్ పెట్టుకొని వెళ్లిపోతుంటారు తప్ప... ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఈ ఏడాది జూన్‌లోనే బీవీనగర్, కొండాయపాలెం గేట్ల స్థానంలో బాక్స్ బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని అధికారులు ప్రకటించారు కానీ, ఆ గడువు ముగిసి కూడా ఐదు నెలలవుతోంది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రైల్వే ఫ్లైఓవర్ల నిర్మాణానికి సన్నాహాలు జరిగాయి. ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన మేరకు భవనాలకు మార్కింగ్ కూడా ఇచ్చారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

● నేడు ఐఏబీ సమావేశం

కీలకమైన రబీ సీజన్‌కు సంబంధించి సాగునీటి కేటాయింపుల కోసం సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం శనివారం జరగనుంది. డీఆర్సీ సమావేశం అనంతరం ఐఏబీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉంది. దీంతో ఈ దఫా ఉమ్మడి జిల్లాలోని పూర్తి ఆయకట్టులో సాగు జరగనున్నది. అయితే సాగునీటి యాజమాన్యంలో కీలకమైన లస్కర్ల నియామకానికి ఇంత వరకూ అనుమతులు రాలేదు. అలాగే కాలువల నిర్వహణకు ఓఅండ్‌ఎం పనులు కూడా చేపట్టలేదు.



చుక్కలనంటిన పొగనారు ధర

● మూట ఖరీదు రూ.6 వేలు ● ఆందోళనలో రైతులు
● వర్షాలకు దెబ్బతిన్న పొగాకు నారుమళ్లు

వలేటివారిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా ఇటీవల 10 రోజులపాటు కురిసిన వర్షాలకు వలేటివారిపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పొగనారుమళ్లు దెబ్బతిన్నాయి. పొగనారుమళ్లకు కుళ్లు తెగులు వ్యాపించి నారంతా కుళ్లిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పొలాలు కూడా ఆరలేదు. దీంతో పొగాకు నాట్లకు అదును దాటిపోయింది. వాతావరణం అనుకూలించి ఉంటే గతనెల 10 నుంచి నాట్లు వేయాలి. అయితే వర్షాలకు పొలాలు ఆరక నాట్లు ఆలస్యమయ్యాయి. అదును దాటిపోతుందనే ఉద్దేశంతో రైతులు ఒక్కసారిగా ఎర్ర, నల్లరేగడి భూముల్లో పొగ నాట్లకు సమాయత్తమయ్యారు. దీంతో అరకొరగా ఉన్న పొగనారు ధరలు చుక్కలనంటాయి. మూట రేటు రూ.6 వేలకు పెరిగింది.

ధర ఎక్కువైనా వేస్తున్నాం..

మొంథా తుఫాన్ ప్రభావంతో పొగనారు మడులు దెబ్బతిన్నాయి. దీనికితోడు ఎడతెరిపి వర్షాలకు పొలాల్లో తేమ ఆరలేదు. దీంతో దుక్కులు సాగలేదు. అదునులో పొగనాట్లు వేయలేకపోయాం. అదును దాటిపోయింది. ఆలస్యమైతే వాతావరణం అనుకూలించక దిగుబడులు తగ్గిపోతాయి. దీంతో పొగనారు మూట ధర రూ.6 వేలు పెట్టి కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నాం.

- దామా చెంచయ్య, పొగాకు రైతు, కూనిపాలెం

అయ్యప్ప భక్తుల కోసం

50 ప్రత్యేక రైళ్లు



● ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండుచోట్ల స్టాపింగ్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణమధ్య రైల్వే ఈనెల నుంచి జనవరి వరకు 50 ప్రత్యేక రైళ్లను ఉమ్మడి నెల్లూరు జిల్లా మీదుగా నడుపనున్నది. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు గూడూరు రైల్వేస్టేషన్‌లో మాత్రమే వీటికి స్టాపింగ్ ఇచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న అయ్యప్ప భక్తులు టికెట్ బుక్ చేసుకొని ఈ రెండు రైల్వే స్టేషన్లలో మాత్రమే రైలు ఎక్కడం, దిగడం చేయాలి. నవంబరు,డిసెంబరు,జనవరి నెలల్లో అయ్యప్ప భక్తుల ఎక్కువగా శబరిమలకు వెళ్లనున్న నేపథ్యంలో రైల్వేశాఖ ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది.

రైలు నెంబరు, ప్రయాణ తేదీల వివరాలు

రైలు నెంబరు	ప్రారంభ స్టేషన్	చివరి స్టేషన్	నవంబరు	డిసెంబరు	జనవరి
07101	మచిలీపట్నం	కొల్లాం	14, 21, 28	26	02
07102	కొల్లాం	మచిలీపట్నం	16, 23, 30	28	04
07105	నరసాపూర్	కొల్లాం	16, 23, 30	7, 14, 21, 28	04, 11, 18
07106	కొల్లాం	నరసాపూర్	18, 25	2, 9, 16, 23, 30	06, 13, 20
07107	చర్లపల్లి	కొల్లాం	17, 24	1, 8, 15, 22, 29	05, 12, 19
07108	కొల్లాం	చర్లపల్లి	19, 26	3, 10, 17, 24, 31	07, 14, 21

యూరియా కోసం

పడిగాపులు

● పనులు ఆపుకుని దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు
● మూడుసార్లే పంపిణీ అంటున్న వ్యవసాయాధికారులు
● మార్చాలంటున్న రైతులు

జలదంకి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్ మొదలైంది. ప్రారంభంలోనే రైతులు యూరియా కోసం ఇక్కట్లు పడుతున్నారు. యూరియా కోసం ముందుగా స్థానిక రైతు సేవా కేంద్రం(ఆర్ ఎస్‌కే)లో గ్రామ వ్యవసాయ సమాయకుడి(వీఏఏ)ని సంప్రదించి, రైతు భూమి పత్రాలు వన్‌బీ అడంగల్, ఆధార్‌కార్డు నకళ్లు అందజేయాలి. వాటిని పరిశీలించాక యూరియా పంపిణీ కార్డును అందజేస్తారు. రికార్డులో పేరు లేకపోతే ఆ రైతు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ పేరు మీద భూమిని సరిచేయించుకుని వచ్చాక కార్డు మంజూరు చేస్తున్నారు. యూరియా పంపిణీ కార్డు మంజూరుకే రెండురోజులు పని మానుకుని రైతులు తిరగాల్సి వస్తోంది. ఇలా మంజూరైన కార్డుకు ఎకరానికి 3 బస్తాల యూరియా ఇస్తారు. అది కూడా మూడు విడతలుగా అందచేస్తారు. అంటే ఎకరా భూమి ఉండే రైతు మూడు బస్తాల యూరియా కోసం రెండు రోజులు రైతుసేవాకేంద్రం వద్దకు, మూడు దఫాలు ఆర్ఎస్‌కేకి వెళ్లాలి. మొత్తంమీద సీజన్‌లో ఐదుసార్లు రైతు వ్యవసాయశాఖ సిబ్బంది వద్దకు వెళ్లాలి.

● ఇదేమైనా న్యాయమా..?

యూరియా పంపిణీ విధానంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. 10, 20 ఎకరాలుండే రైతులైతే తప్ప .. ఒకటిరెండు ఎకరాలు ఉండే రైతు 'ఇన్నిసార్లు పోయి.. ఏం తెచ్చుకుంటాంలే.. అనే సందిగ్ధంలో పడుతున్నాడు. బ్లాక్ మార్కెట్‌లో కొనడం తప్ప... గత్యంతరం లేదనే భావనకు వస్తున్నారు. ఈ క్రమంలో అధిక ధరకు కొనుగోలు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులు సిద్ధపడి, ఆర్ఎస్‌కేలకు వెళ్లడం లేదు. కాగా అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని అధికారులు రేషన్ విధానం అమలు చేస్తున్నారు. ఈ విషయమై రైతులకు వారు అవగాహన కల్పించాల్సి ఉంది.



● కంపెనీల ప్రతినిధుల చేతివాటం

డీలర్లు ఎంతోకొంత ఎరువుల కంపెనీల ప్రతినిధులకు ముట్టచెబితే తప్ప.. వారు యూరియాను కేటాయించడం లేదు. లేనిపక్షంలో నానో ఎరువులను కొంటేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతున్నారు. ఈ నానో ఎరువులపై రైతులు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఇలా సీజన్ మొదట్లోనే యూరియా పంపిణీ విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు యూరియా విషయాన్ని సీఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి, కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి రైతులకు సకాలంలో యూరియా అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

అయ్యోర్లకు ఆటలు

● 15 నుంచి పోటీలు
● ఒత్తిడిని అధిగమించేందుకే....
● రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహణ

నెల్లూరు(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. నిత్యం విధి నిర్వహణలో, పాఠాల బోధనలో బిజీగా ఉండే గురువులకు కాస్త ఆటవిడుపు కోసం రాష్ట్రంలోనే తొలిసారి క్రీడాపోటీల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పోటీలు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు షెడ్యూల్‌ను విడుదల చేశారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించడం, స్నేహపూరిత వాతావరణం కోసం క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● ప్రత్యేక కమిటీల ఏర్పాటు

జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య(ఎస్‌జీఎఫ్) తరహాలోనే తమకు కూడా మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని చెబుతున్నారు. పోటీల నిర్వహణకు అధికారులు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మండలస్థాయిలో పోటీల నిర్వహణ బాధ్యతను మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌ను, ఎంఈవో-1, 2లను నిర్వహణ అధికారులుగా నియమించనున్నారు. అలాగే డివిజన్‌స్థాయిలో డివిజన్ కోఆర్డినేటర్, డిప్యూటీ డీఈవో, జిల్లాస్థాయిలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, డీఈవోలు, రాష్ట్రస్థాయిలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఏడీ, జేడీలు కోఆర్డినేటర్‌లు వ్యవహరిస్తారు.

● 15 నుంచి నిర్వహణ

అయ్యోర్ల క్రీడల పోటీల తేదీలను కూడా ఖరారు చేశారు. మండలస్థాయిలో నవంబరు 15, 16వతేదీల్లో, డివిజన్‌స్థాయిలో నవంబరు 22, 23వతేదీల్లో, జిల్లాస్థాయిలో నవంబరు 28, 29, 30వతేదీల్లో, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 6, 7 లేదా 13, 14, 15వతేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.



రేపు రాళ్లపాడు నీటి విడుదల

లింగసముద్రం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తిగా నిండినందున ఆదివారం ఉదయం 10 గంటలకు కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ జీ మునిరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నందున, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రాజెక్టు నీటిని కాలువలకు విడుదల చేస్తారని ఆయన తెలిపారు.

● సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 17,496 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కులు వదులుతున్నామని, డ్యాంలో 71.467 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

● కండలేరులో 58.55 టీఎంసీలు

రాపూరు : కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత 58.55 టీఎంసీలు ఉందని ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 700 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ఆయన పేర్కొన్నారు.

కార్తీక దీపోత్సవం ఏర్పాట్ల పరిశీలన

ముత్తుకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరులో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవం ఏర్పాట్లను శుక్రవారం కృష్ణపట్నం సీఐ రవినాయక్ పరిశీలించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నేల మల్లికార్జునయాదవ్‌తో కలిసి ముత్తుకూరు మత్స్య కళాశాలలోని క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తులకు సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ గురించి కళాశాల యాజమాన్యం, నాయకులతో చర్చించారు. ఎస్‌ఐలు ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు కొండూరు విజయ్, గుంజి శ్రీనివాసులు, నీళ్ల రాంబాబు, రోసి శ్రీకాంత్, పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11546
వెండి కిలో ధర	రూ. 152900
వెండి ఒక గ్రాము	రూ. 158.90

సామూహిక కుంకుమార్చన


కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయం శుక్రవారం కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో భక్తులు వెలిగించిన కార్తీక దీపాలతో కళకళలాడింది. భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్షలతో ఆలయానికి వచ్చి కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షి తాయి అమ్మవారిని దర్శించుకున్నారు. గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జున స్వామికి నిర్వహించిన నిత్య కళ్యాణోత్సవం అభక్తులను ఆకట్టుకుంది. రాత్రి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకి సేవలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గోవుల తరలింపును అడ్డుకున్న పోలీసులు


గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

కోవూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంటైనర్‌లో నెల్లూరు వైపు నుంచి ఒంగోలుకు శుక్రవారం గోవుల్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... గోవుల అక్రమ తరలింపు కోసం ఓ వ్యక్తి కంటైనర్ సిద్ధం చేసుకున్నాడు. నెల్లూరులో 12, కోవూరులో 3 గోవులను కొనుగోలు చేశారు. వాటిని వాహనంలో తరలిస్తుండగా విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో పోలీసులు జాతీయ రహదారి వద్దకు చేరుకుని కంటైనర్‌ను గోవులతో సహా స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్ డ్రైవరును అదుపులోనికి తీసుకున్నారు. కంటైనర్ యజమానిని అరెస్టు చేసేందుకు అతడి నుండి వివరాలు రాబడుతున్నారు. కబేళాలకు తరలించేందుకే ఆవులను తీసుకెళుతున్నట్లు పోలీసులు అనుమానించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీజీఓఈఏ ప్రధాన కార్యదర్శిగా మస్తానయ్య


మస్తానయ్య

మనుబోలు, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని వీరం పల్లికి చెందిన పొట్టేళ్ళ మస్తానయ్యను నియమించినట్లు శుక్రవారం ఏపీజీఓఈఏ రాష్ట్ర అధ్యక్షుడు పాణ్యం వేణు, ప్రధాన కార్య దర్శి అల్లం సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పశు సంవర్ధకశాఖ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసో సియేషన్ జిల్లా అధ్యక్షుడుగా మస్తానయ్య పనిచేస్తున్నాడు. ఏపీజీ ఓఈఏకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియా మకం పట్ల పలు వురు అవుట్ సోర్సింగ్ ఉద్యో గులు హర్షం వ్య క్తం చేశారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు కుమారుడు మహేష్ నాయుడు వివాహం శుక్రవారం వెంకటా చలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీనాయుడు, మాజీ విజయాడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిలతో పాటు, మండల టీడీపీ అధ్యక్షులు రామ కృష్ణయ్య, ఏఎంసీ చైర్మన్ రామకృష్ణారెడ్డిలు హాజరయ్యారు. నూతన దంపతులైన మహేష్, శ్రీకౌసల్యను ఆశీర్వదించి అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు రాజ కీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మనుబోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. మనుబోలు, వీరంపల్లి, చెర్లోపల్లి, కట్టువపల్లి, వెంకన్నపాళెం, ముద్దమూడి సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటదాకా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్ఫూర్తిదాయకం.. వందేమాతర గీతం!

150 ఏళ్లు నిండిన సందర్భంగా వాడవాడలా ర్యాలీలు

విడవలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరంలో దేశ సమైక్యతకు వందేమాతరం గీతం ఎంతో స్ఫూర్తినిచ్చిందని విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. వందేమాతరం గీతాన్ని బంకిం చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత అధ్యాపకులు భారత మాతకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వందేమాతర గేయాన్ని ఆలపించి, ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాతత్పరత అలవడతాయని స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయురాలు వేదవతి అన్నారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవం సందర్భంగా బుచ్చి మున్సిపాలిటీలోని రామచంద్రా పురం 'పీఎంశ్రీ' పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వందేమాతరం గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌కుమార్, నిర్మల, అరుణ కుమారి, బ్రహ్మారెడ్డి, రసూల్ అహ్మదున్నీసా, విద్యార్థులు పాల్గొన్నారు.


విడవలూరు కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


బుచ్చి: వందేమాతర గీతం ఆలపిస్తున్న చిన్నారులు

రాపూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకట రాజేష్ మాట్లాడుతూ యువత దేశభక్తిని పెంపొందించుకుని, దేశ రక్షణ కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మారెళ్ల భవానీ మాట్లాడుతూ వందేమాతరం గీతం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, జెమ్స్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ అధ్యాపకులు పాల్గొ న్నారు.

కొడవలూరు : ప్రతీ ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని ఎన్వీ గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ పి గుణశేఖర్ పిలుపునిచ్చారు. నార్తురాజుపాలెం వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఈవో గిరీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఫిజికల్ డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొ న్నారు.

మనుబోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. అరుణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.


రాపూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో భవాని


మనుబోలు: వందేమాతరం ఆలపిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు


సీఎస్ఆర్ నిధులతో సర్వేపల్లికి కొత్త రూపు!

● రూ.5కోట్లతో ముత్తుకూరు, కృష్ణపట్నంలో పనులు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో సర్వేపల్లి నియోజకవర్గానికి కొత్త రూపు తీసుకువస్తామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్‌రంజన్‌తో కలిసి కృష్ణపట్నం తుపాను షెల్టర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వ ర్యంలో కుట్టుశిక్షణ, తాగునీటి పథకం, చెత్త తరలించే రిక్షాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీలను అదానీ ఫౌండేషన్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తుండడం ఎంతో సంతోషకర పరిణామన్నారు. మేజర్ పంచాయతీలైన రెండు గ్రామాల్లో సకల వసతులు కల్పించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. మొదటి విడతలో ముత్తుకూరులో రూ.4కోట్లు, కృష్ణపట్నంలో రూ.1కోటి ఖర్చు చేస్తున్నారని, ముత్తుకూరు శ్మశానంలో వసతులు కల్పించడంతోపాటు గ్రామ వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించనున్నారన్నారు. ఏడాదికి 600 మంది మహిళలకు ఇక్కడ కుట్టు శిక్షణ ఇస్తారని, యువతకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనుండడం సంతోషమన్నారు. మరోవైపు సెయిల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతోందని, నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి సోలార్ లైట్లు అందించబోతోందన్నారు. బాలికలకు 1800 సైకిళ్లు, వంద మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు ఇవ్వబోతున్నామన్నారు. ముత్తుకూరులో బీపీసీఎల్ సంస్థ సహకారంతో రూ.7.50కోట్లతో కేరళ మోడల్‌లో హైస్కూల్ నిర్మించబోతు న్నామన్నారు. పామాయిల్ కంపెనీలు కూడా గిరిజన కాలనీలను దత్తత తీసుకున్నాయన్నారు. అన్నీ కంపెనీలు కూడా సీఎస్ఆర్ నిధుల్లో 70 శాతం ఈ ప్రాంతంలోనే ఖర్చు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాగాల శివకృష్ణ, మామిడాల శ్రీనివాసులు, ప్రదీప్‌రెడ్డి, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పార్లపల్లి శ్రీనివాసులురెడ్డి, ముత్యంగౌడ్, అదానీ కృష్ణపట్నం పోర్టు కార్పొరేట్ ఎఫైర్స్ ప్రతినిధులు మృత్యుంజయరామ్, వేణుగోపాల్, సీఎస్ఆర్ ప్రతినిధులు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో అపస్మా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న అపస్మా ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో అపస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్), రాపూరు, సర్వేపల్లి యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అపస్మా రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు అవసరమని తెలిపారు. రాబోయే జిల్లా స్థాయి క్రీడా పోటీలు, అపస్మా సెట్ పరీక్ష, అలాగే అనేక అకడమిక్ అంశాలపై చర్చించారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనిట్ సభ్యులు, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, క్రీడల పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేశారు.

క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ


సంగం: క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

సంగం, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా వైద్య సిబ్బంది వైద్యశాల నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యం ముద్దు, పొగ తాగవద్దు... క్యాన్సర్‌కు గురికావద్దు అంటూ నినాదాలు చేశారు.

●**ఉదయగిరి రూరల్:** మండలం లోని అప్పసముద్రం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ ఎండీ మన్సూర్‌అలీ, సీహెచ్‌వో సురేష్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు మైక్రోఫోన్ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే పొగాకు ఉత్పత్తులు, మద్యం వినియోగంతో వ్యాపించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్య లను, వీడియోలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శిం చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సౌజన్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కృష్ణయ్య, అక్కుల రాజు, మాలకొండయ్య, యశోద, పాల్గొన్నారు.

●**సీతారామపురం:** శారీరక శ్రమ లేకుంటే క్యాన్సర్ విస్తరించే ప్రమాదం ఉందని డాక్టర్ స్వప్నరెడ్డి అన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు


విజేతలతో నిర్వాహకులు

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10న మాజీ మంత్రి కాకాణి జన్మ దినోత్సవాన్ని పురస్క రించుకుని పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన జూనియర్ అండ్ సబ్ జూనియర్ బాలురు మరియు బాలికలు చెస్ చాంపియన్‌షిప్ -2025 పోటీలు ముగిశాయి. హోరాహోరీగా సాగిన చెస్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం జరిగింది. విద్యార్థుల్లో ఉండే క్రీడా ప్రతిభా పాటవాలను వెలికి తీయాలని ఉద్దేశంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు అంజాద్ తెలిపారు. విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. 30 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, శివ, మణి, జమీర్, అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

'మనమిత్ర' వాట్సాప్ సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో భవాని

రాపూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వాట్సప్ సేవలను తప్పక వినియోగించుకోవాలని ఎంపీడీవో మారెళ్ల భవాని తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వ్యాపారస్తులకు ప్రభుత్వం (మనమిత్ర)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం వాట్సప్ నెంబరు, క్యూఆర్ కోడ్ వంటి వాటితో యాప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చు అన్నారు. దీంతో ప్రభుత్వ రంగ సేవలకు సంబంధించి ప్రతి కుటుంబానికి మన మిత్ర యాప్ సేవల అవగాహన కల్పించడం, వాట్సాప్ ద్వారా డిజిటల్ సేవల వినియోగాన్ని పెంచడం ఈ అవగాహనా కార్యక్రమం అని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు, ఇతర అంశాలు వంటివి చేసుకోవచ్చు అన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన


క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇందుకూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదెమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ సకాలంలో గుర్తించి నివారణ, చికిత్సలపై విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. క్యాన్సరును పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, చాలా రకాల క్యాన్సర్లను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా నివారించే అవకాశం ఉందని తెలిపారు. కుటుంబంలో క్యాన్సర్ హిస్టరీ ఉన్న వారు ప్రధానంగా మహిళలు బ్రెస్ట్, సర్వికల్ క్యాన్సర్ టెస్టులు పురుషులు, ప్రోస్టేట్, కోలోరెక్టల్స్ టెస్టులు చేయించుకోవాలన్నారు. పాఠశాల దశలో పిల్లలు క్యాన్సర్ గురించి తెలుసుకుని తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం, వ్యాయామాన్ని క్రమం తప్పకుండా అలవర్చుకోవడం, వీటితోపాటు క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించడం ద్వారా ఎక్కువ నష్టపోకుండా ఉండవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్‌రావు, ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ రమణయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అరుణ, సీహెచ్‌ఓ నందిని, హెల్త్ అసిస్టెంట్ మాధవ, సచివాలయం హెల్త్ సెక్రటరీ ధనలక్ష్మీ, ఎంఎల్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసి మెట్టప్రాంత వాసుల కష్టాలు తీర్చాలని శుక్రవారం నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు, టీడీపీ యువ నాయకుడు మార్నేని రామకృష్ణలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో గల ఎనిమిది మండలాలు మూడు డివిజన్ల పరిధిలో ఉండడంతో ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక పోవడంతో పాటు ఎలాంటి అభివృద్ధి జరగడంలేదన్నారు. ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసి అన్ని మండలాలను అందులో విలీనం చేయాలన్నారు. ఆ దిశగా జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు


మనోజ్ (ఫైల్)

కలిగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు సరదాగా సముద్రతీరానికి వెళ్ళి కాసేపు సంతోషంగా గడిపి తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. కాసేపట్లో గ్రామానికి చేరుకుంటారనగా ఇంతలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని పెద్దపాడుగ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెంకు అనుసంధానమైన కొప్పోలు వారిపాలెంకు చెందిన కొప్పోలు మనోజ్, తన స్నేహితుడు మురారి పెంచలప్రసాద్, ఇటీవల బెంగుళూరునుండి వచ్చిన పెంచలప్రసాద్ మేనమామ కొడుకు నక్కా కిరణ్‌లు ముగ్గురు కలిసి ఆటవిడుపుకోసం కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్రతీర ప్రాంతానికి ఒకే మోటార్‌సైకిల్‌పై వెళ్ళారు. అక్కడ కాసేపు సరదాగా గడిపి కావలిలో పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. కావలి-కలిగిరి రహదారిలో పెద్దపాడు గ్రామం వద్ద రోడ్డు మలుపు సూచికను వేగంగా ఢీకొనడంతో రోడ్డుకి దూరంగా ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో కొప్పోలు మనోజ్ (25) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వింజమూరు తరలించారు. నక్కా కిరణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్‌ఐ ఉమాశంకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు తరలించారు. మనోజ్ ఐటీఐ పూర్తిచేసి కొంతకాలంగా స్థానికంగా పనులకు వెళుతున్నాడు. కొప్పోలువారిపాలెం గ్రామస్తులు, మనోజ్ కుటుంబసభ్యులు, స్నేహితులు అక్కడికి చేరుకున్నారు. మనోజ్ మృతదేహాన్ని చూసి కన్నీళ్లపర్యంతమయ్యారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించేలా టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, టీడీపీ నాయకుడు కొప్పోలు కొండలరావు సహకారం అందించారు. మనోజ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

మూర్ఛతో గుర్తుతెలియని మహిళ...


గుర్తుతెలియని మహిళ మృతదేహం

నెల్లూరు(క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూర్ఛవ్యాధితో గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన నగరంలోని శెట్టిగుంట రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. మృతురాలు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగి పసుపు, గులాబీ ఆకుపచ్చ రంగు డిజైన్ చీర, లైట్ గ్రీన్ బ్లౌజ్ ధరంచి ఉంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకు తరలించారు. ఆ వార్డు వీఆర్వో పీ.ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నవాబుపేట పోలీసుస్టేషన్‌లో లేదా, 9440796306కు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ జీ.వేణుగోపాల్‌రెడ్డి కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఐ జి గంగాధర్

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని వాశిలి సమీపంలో నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వాశిలి సమీపంలో రోడ్డుపై రెండు ఆటోలు ఢీకొన్నాయి. దాంతో ఒక ఆటో రోడ్డు పక్కనే వ్యవసాయ పనులు చేసుకుంటున్న వాశిలికి చెందిన దాసరి రవికుమార్‌పై పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సీఐ జి గంగాధర్, ఎస్‌ఐ షేక్ జిలాని సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డుపై పడి ఉన్న ఆటోను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పక్కకు తొలగించారు. క్షతగాత్రుడు దాసరి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు


అదృశ్యమైన బాలుడు

నెల్లూరు (క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డు వెంగమాంబవీధిలో వెంకటలక్ష్మి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు లోహిత్ కుమార్ స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురు వారం మధ్యాహ్నం బాలుడు భోజ నం చేసేందుకు ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు రాలేదు. కుమారుడు కనిపించకపోవడంతో తల్లి చుట్టుపక్కల గాలించినా జాడ తెలియరాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీకి యత్నం

మనుబోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామపురంలోని గొలగమూడి అనసూయమ్మ ఇంట్లో గురువారం అర్ధరాత్రి ఓ దొంగ చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. అనసూయమ్మ భర్త గతేడాది చనిపోవడంతో నెల్లూరులో కుమారుడి దగ్గర ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగ రెండు గేట్ల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. అలికిడి కావడంతో చుట్టుపక్కల ఇళ్లవాళ్ళు అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శివరాకేష్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని చాకచక్యంగా దొంగను పట్టుకున్నారు. వెంటనే అనసూయమ్మ ఇంటికి చేరుకుంది. వస్తువులేవీ చోరీకి గురి కాలేదని పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ పట్టివేత

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరి నుంచి నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను విజిలెన్స్ సీఐ సుభానీ, పౌర సరఫరాలశాఖ డీటీ ఇండ్ల రవి పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మరుపూరు గ్రామం వద్ద మహీంద్రా మ్యాక్స్ వాహనంలో 111 ప్లాస్టిక్ బ్యాగుల్లో 4170 కేజీల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం విలువ సుమారు రూ. 2లక్షలు, వాహనం విలువ రూ.9 లక్షల మేర ఉంటుందన్నారు. వాహన యజమాని సతీష్, డ్రైవర్ సాల్మన్‌పై కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్
శనివారం, 8 నవంబరు 2025
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 585

కల్వర్టు నిర్మించండయ్యా..!

నెల్లూరురూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోకి వెళ్లేందుకు, పొలాల్లో నుంచి పంట తీసుకువచ్చేందుకు తీవ్ర ఇబ్బదికరంగా మారిన కొమ్మర పూడి గ్రామంలోని బాటకు కల్వర్టు నిర్మిచాలని రైతులు కోరుతున్నారు. పంట పొలాల్లోకి వెళ్లే మార్గంలో కొంత దూరం సీసీరోడ్డును ఐదేళ్ల క్రితం నిర్మించిన అధికారులు ఆపై కల్వర్టు నిర్మాణాన్ని వదిలేశారు. అది కాస్త ప్రధాన సమస్యగా మారింది. పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు పంట ఉత్ప త్తులను తీసుకువచ్చేందుకు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


వంతెన లేక రోడ్డుపై పారుతున్న నీరు

న్యూస్ బాక్స్

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో భార్యను హత్య చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో భర్త రాపూరు శ్రీనివాసులు అలియాస్ చిన్నోడుకు జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా న్యాయాధికారి (ప్రత్యేక మహిళా కోర్టు) ఎంఏసోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... మనుబోలు మండలం కేఆర్.పురంకు చెందిన రాపూరు శ్రీనివాసులు, అయన భార్య వెంకటరమణమ్మల మధ్య వారి కుమార్తె ప్రేమ వివాహపై గొడవలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో 2018 జూలై 2వ తేదీన ఇద్దరు కలసి నెల్లూరు నుంచి కేఆర్ పురంకు ఆటోలో వెళుతూ గొడవపడ్డారు. దీంతో మార్గ మధ్యంలో కొండూరుసత్రం సమీపంలో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గార్డెన్ ఎదురుగా ఆటోను ఆపి భార్య తలపై జాకీ రాడ్‌తో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణా కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ రఫీమాలిక్ వాదించారు.

హత్యాయత్నం కేసులో పదేళ్లు కఠిన కారాగార శిక్ష

నెల్లూరు(లీగల్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం వదినపై హత్యా యత్నం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో రాయపాటి వీరరాఘవయ్యకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా న్యాయాధికారి (ప్రత్యేక మహిళా కోర్టు) ఎంఏసోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తిక్కవరంకు చెందిన రాయపాటి వెంకటలక్ష్మి తన భర్త, ఇద్దరు పిల్లలతో కలసి టిఫిన్ అంగడి పెట్టుకుని జీవిస్తుంది. అయితే ఆస్తి కోసం ఆమె మరిది రాయపాటి వీరరాఘవయ్య అమెను గ్రామం విడిచి వెళ్లిపోవాలని గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో 2017 అక్టోబరు 1వ తేదీన అర్ధరాత్రి 2 గంటల సమయంలో అమె తన ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన నిందితుడు అమెపై బండ రాయితో దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ మేరకు చిల్లకూరు పోలీసులు నిందితుడిపై హత్యా యత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసు విచారణ కాలంలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా జైలు శిక్షతోపాటు రూ2 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ రఫీమాలిక్ వాదించారు.

సాహితీవేత్త సుజనారామం

- సృజనాత్మక రచనలతో ప్రశంసలు
- పలు అవార్డుల కైవసం
- గృహిణిగా, ఉపాధ్యాయురాలిగా రాణింపు

ప్రతిభ PRATIBHA



సార్క్ సాహిత్య సదస్సులో ప్రసంగిస్తున్న సుజనారామం(ఫైల్)

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'కవిత్వం మధురంగా ఉండాలి. కవితల ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావచ్చు. ప్రతీ ఒక్కరిని ఆలోచింపచేసేలా సాహిత్యం ఉండాలి' అనేది ప్రముఖ సాహితీవేత్త పెరుగు సృజనారామం ఆశయం. ఇటు కవయిత్రిగా, అటు ఉపాధ్యాయురాలిగా, గృహిణిగా ఆమె రాణిస్తున్నారు. ఈ క్రమంలో పలు అవార్డులు సాధించారు. పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. భర్త పెరుగు రామకృష్ణ అంతర్జాతీయ కవిగా ఎదిగేందుకు ఆమె తనవంతు సహకారం అందించారు.

● గురువు నుంచి రచనా వ్యాసాంగం

ఉమ్మడి నెల్లూరుజిల్లా నాయుడుపేట మండలం మేనకూరులో అప్పాడి పెంచలయ్య, లలితమ్మ దంపతుల రెండో సంతానం సుజనారామం. చదువులో రాణిస్తూ బీఏ పూర్తి చేశారు. ఆమె హైస్కూల్ విద్యార్థినిగా ఉన్నప్పుడు తెలుగు ఉపాధ్యాయుడు పెంచలరెడ్డి బోధన పట్ల ఆకర్షితురాలయ్యారు. ఆయన కథలు, కవితల రూపంలో పాఠాలు బోధించేవారు. గురువు నుంచి రచనా వ్యాసాంగంతోపాటు భాషాభిమానం పెంచుకున్నారు.

● తెలుగు టీచర్ కావాలని...

తాను తెలుగు టీచర్ కావాలని, సాహిత్యంలో తన కంటూ గుర్తింపు తెచ్చుకోవాలన్న తపన ఆమెలో ఉండేది. ఈ క్రమంలో అంతర్జాతీయకవి పెరుగు రామకృష్ణతో వివాహమైంది. దీంతో తెలుగు సాహిత్యం పట్ల ఆమెకు మరింత ఆసక్తి పెరిగింది. భర్త ప్రోత్సాహంతో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ (తెలుగు సాహిత్యం) పూర్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ డీఎస్సీలో శిక్షణ పొంది, ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆమె పొదలకూరు డీఎన్ఆర్ జడ్పీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్నారు. 23 ఏళ్లగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో పనిచేస్తూ విద్యార్థులకు చదువుతోపాటు జీవిత విలువలను బోధిస్తున్నారు. గత 25 ఏళ్లగా సాహితీసేవ చేస్తున్నారు.

● 60కిపైగా వ్యాసాలు

విద్యార్థుల్లో వ్యక్తిత్వం పెంపొందించేందుకు స్థానిక వార పత్రికల్లో సుమారు 60కిపైగా వ్యాసాలు రాశారు. అలా ఆమె రచనా రంగంలోకి ప్రవేశించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సంబంధించి విభిన్న కోణాలతో 'మల్లె మొగ్గలు' శీర్షికన ఓ పుస్తకం ప్రచురించారు. సాహిత్యనిధి పేరిట ఫేస్‌బుక్‌లో తెలుగు సాహిత్య గ్రూప్ వ్యవస్థాపకురాలిగా ఉన్నారు. 2005లో ఆమె మౌనభాష్యం అనే ద్విభాషా కవితా సంపుటిని వెలువరించారు. అంతేకాక పలు కవి సమ్మేళనాల్లో పాల్గొనడంతోపాటు ఆకాశవాణి, దూరదర్శన్‌లలో కవితా గానం చేశారు. సాహిత్య అకాడమీ, సార్క్ దేశాల సదస్సులు, వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయట్స్ అంతర్జాతీయ సదస్సులో కూడా పాల్గొన్నారు. తెలుగు రచయితల సమ్మేళనంలోనూ, భారత రచయితల సమ్మేళనంలోనూ మహిళలు గురించి పలు పత్రాలు సమర్పించారు.


అమరావతిలో జరిగిన తెలుగు సాహిత్య సదస్సులో సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకున్న సుజనారామం(ఫైల్)

● ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం

సృజనారామం యువజన విభాగంలో ఉత్తమ రచయిత్రిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్నారు. మౌనభాష్యం కవితా సంపుటికి కవయిత్రుల అఖిల భారత సదస్సులో జ్ఞాన పీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సీ.నారాయణరెడ్డి నుంచి అవార్డు అందుకున్నారు. మానస, కళాజ్యోతి, కళాంజలి సంస్థల నుంచి సాహిత్య పురస్కారాలు అందుకున్నారు. సార్క్ దేశాల సదస్సుకు ఆరు సార్లు ఆహ్వానం అందుకున్నారు. 2015, 2016, 2017 సంవత్సరాల్లోనూ, 2019, 2024లోనూ జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయట్స్‌లో భారతీయ కవిగా పాల్గొని మెడల్స్ అందుకున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా గణేష్ ఘాట్

- ముగిసిన కార్తీక దీపోత్సవం


స్వర్ణ లింగేశ్వరుడికి పూజలు చేస్తున్న తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వర్ణాల చెరువు వెంబడి ఇరుకళల పరమే శ్వరి ఆలయం, గణేష్ ఘాట్ స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయాల కలయికతో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వెయ్యి ఏళ్ల క్రితం వెలిసిన స్వర్ణలింగేశ్వరస్వామికి మహా కుంభాభిషేకం స్వహస్తాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, రుద్రాభిషేకం, మహాపూర్ణాహు తిలు జరిగాయి. ప్రతీ ఒక్కరూ కార్తీక మాసంలో శివ కేశవులకు అభిషేకాలు దీపార్చనలు చేయాలని సూచించారు. సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు, దీపా వెంకట్ ప్రతి పండుగను ఈ ప్రాంతంలో వారసత్వంగా నిర్వహించాలని తెలిపారు. 3రోజుల పాటు కార్తీక మాస దీపోత్సవాలను నిర్వహించినందుకు దీపావెంకట్, కమిటీ సభ్యులను అభినందిస్తూ మంగళ శాసనాలు అందజేశారు. దీంతో కార్తీక దీపోత్సవాలు ఘనంగా ముగిశాయి. కుంభాభిషేకం అనంతరం కార్తీక పౌర్ణమి దీపోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక శివలింగానికి పూజలు చేసి స్వర్ణాల చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసా దాలు, అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ నాయకులు పీ.సురేంద్రరెడ్డి, అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల, కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షులు కోడూరు జయప్రద, పీ.సత్యనాగేశ్వరరావు, వ్యాసప్రసాద్, కోడూరు జయరామ్, విజయకుమార్ హర్షవర్ధన్, సరిత, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నివారణకు కృషి

- జీజీహెచ్‌లో అవగాహన ప్రదర్శన



జీజీహెచ్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిని నివారించేందుకు కృషి చేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా వైద్య విద్యార్థులతో కలసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో గుండె జబ్బులు మొదటి స్థానంలో ఉంటే క్యాన్సర్ వ్యాధి రెండవ స్థానంలో ఉందన్నారు. పొగాకు, మద్యపానం, ధూమపానం, ఊబకాయం, ఆహారావు అలవాట్లు, ఇన్ఫెక్షన్ ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో 18 ఏళ్లు పూర్తయిన వారికి ఇంటివద్దకే వెళ్లి క్యాన్సర్ పరీక్షలు నిర్వహంచేలా ఎన్‌సీడీ 4.0 స్క్రీనింగ్ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ యశ్వంత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

10 నుంచి గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్

- రాష్ట్రంలో మొదటగా నెల్లూరు రూరల్లో ..
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



చంద్రన్న విద్యుత్ వెలుగులు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇక నుంచి గ్రామాలకు విస్తరింప చేస్తున్నట్లు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి పార్టీల ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రూ.9,139 కోట్లతో 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు ప్రణాళిక తయారు చేసి పనులు మొదలుపెట్టారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దశల్లో ఈ పనులు జరుగుతుండగా నెల్లూరురూరల్ నియోజకవర్గంలో మాత్రం పూర్తి చేశామన్నారు. 10వ తేదీన ఉదయం 10 గంటలకు కోడూరుపాడులో లాంఛనంగా రైతులతో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 18 గ్రామాలతో పాటు మరో మూడు గ్రామీణ ప్రాంత డివిజన్లలో 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పూ ర్తిగా అందుబాటులోకి రానున్నదన్నారు. 10వ తేదీ నుంచి 20 రోజుల పాటు ట్రైల్ రన్ జరుగుతుందని, ఆపై యధావిధిగా కొనసాగుతుందని చె ప్పారు. రైతాంగానికి, నివాసాలకు వేర్వేరు లైన్లుతో త్రీఫేజ్ విద్యుత్‌సరఫరాను ఏర్పాటు చేశారన్నారు. తన నియోజకవర్గానికే రూ.50 కోట్లు కేటాయించగా పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. దీనివల్ల 80 వేల మంది ప్రజలు విద్యుత్ ప్రయోజనాన్ని పొందుతారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పట్నుంచి ఇప్పటి వరకు ప్రజలు ఎదుర్కొంటున్న అంతరాయాలకు, లోటల్టేజీ సమస్యలకు ఇక తెరపడనుందన్నారు. 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముందుగా వందేమాతరం గీతానికి ఆలపించారు. అనంతరం చంద్రన్న విద్యుత్ వెలుగులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు నోటీసులు


ఆర్ఐలతో మాట్లాడుతున్న టీపీఆర్వో వాసుబాబు

నెల్లూరు(సిటీ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌కు పన్ను చెల్లించకుండా ఉన్న మొండి బకాయిదారులకు శుక్రవారం టీపీఆర్వో వాసుబాబు, ఆర్ఐలు జేమ్స్‌గార్డెన్, బృందావనం ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నోటీసులు అందచేశారు. పన్ను చెల్లించకుంటే ఆస్తులను జప్తు చేసుకుంటామని హెచ్చరించారు. డిసెంబరు 13న జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నామని, అందులో పెండింగ్ పన్నులను క్లియర్ చేసుకోవాలని సూచించారు. కాగా భగత్‌సింగ్ కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కమిషనర్ నందన్ పరిశీలించారు. అలాగే కార్పొరేషన్‌కు ప్రభుత్వం అందచేసిన మొంథా అవార్డు అందుకున్న కమిషనర్ నందన్‌ను బీజేపీ నాయకులు అభినందించారు. అవార్డు అందుకునే చిత్రపటాన్ని జ్ఞాపికగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కొండయ్య, శ్రీధర్, సాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డికి కృతజ్ఞతలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం పోర్టులో ట్యాంకర్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి పరిష్కరించారని తిరుపతి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు యోగానంద తెలిపారు. సోమిరెడ్డి స్థానికంగా అన్నీ కంపెనీలు, ట్యాంకర్స్ అసోసియేషన్‌తో చర్చించి ఎటువంటి అవకతవకలు జరిగినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారన్నారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ఎన్ని ట్యాంకరైనా ఆయిల్‌ను ఇక్కడ ఫ్యాక్టరీల నుంచి తీసుకునిపోవచ్చని హామీ ఇవ్వడంపై తిరుపతి జిల్లా ఆయిల్ ట్యాంకర్స్ తరఫున సోమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపాస్తులకు అండగా ఎమ్మెల్యే ఉంటానని చెప్పారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఆయిల్ కంపెనీలు తమకు పూర్తిగా సహకారం అందిస్తామని చెప్పారన్నారు. ఆయిల్ ట్యాంకర్ల అసోసియేషన్‌కు మద్దతుగా నిలబడిన ఎమ్మెల్యేకు, జిల్లా అసోషియేషన్‌కు, జిల్లా అధికారులకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వందేమాతరం స్ఫూర్తితో వైద్య సేవలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత


వందేమాతరం గీతం ఆలపిస్తున్న వైద్యులు, సిబ్బంది

నెల్లూరు(వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం స్ఫూర్తితో వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం 150వ జాతీయ గీతోత్సవాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ఎంతో ఆదరణ చూపాలని సూచించారు. వారు త్వరగా కోలుకునేలా వైద్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డెమో కనకరత్నం, న్యూక్లియర్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు, ఏవో నిశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● మురిగిపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నాటి భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రతీ ఒక్కరికీ దేశభక్తికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మురిగిపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ వేణుగోపాలస్వామి నగరపాలక పాఠశాల విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ వందేమాతరం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కే.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిత్యావసరాల పంపిణీ


మత్స్యకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుపాను తాకిడికి ఉపాధిని కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అందచేసిన నిత్యావసరాలను టీడీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. 33 డివిజన్ ప్రాంతంలోని మత్స్యకారులు నెల్లూరు చెరువు ఆధారిత ఉపాధితో జీవిస్తున్నారని ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి కరణం హజరత్‌నాయుడు తెలిపారు. వీరి వివరాలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రభుత్వానికి సిఫార్సు చేశారని చెప్పారు. బాధిత మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులుఅందచేశామన్నా రు. సుమారుగా నెల రోజుల పాటు ఉపాధికి దూరమైన మత్స్యకారులను ఆదుకున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్, నాని, శామ్యూ ల్ పాల్గొన్నారు.

నేతన్నలను ఆదుకోవాలి : బీజేపీ

మొంథా తుపాను వల్ల ఉపాధి కోల్పోయిన చేనేత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. ఆయన నారాయణరెడ్డిపేటలో నేతన్న కుటుంబాలను పలకరించారు. అర్హత ఉన్నా అనేక కుటుంబాలకు సర్కారు సహాయం అందలేదన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాలని సూచించారు. బియ్యం, నిత్యావసరాలను కొందరికే ఇచ్చారని చెప్పారు. మగ్గాలుండే కార్మికులందరికీ సహాయం అందచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, సుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- మలేరియా అధికారి హుస్సేనమ్మ


మాట్లాడుతున్న మలేరియా అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు(వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు దోమలు కుట్టకుండా తగిన జాగత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ వెల్లడించారు. శుక్రవారం నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న గిరిజన బాలికల సంక్షేమ భవనంలో నిర్వహించన సదస్సులో ఆమె మాట్లాడారు. లార్వా దశలోనే దోమల నివారణ చర్యలు తీసుకోవాలని వసతిగృహం నిర్వాహకులకు సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధులు పగటి పూట కుట్టే దోమల వల్ల వస్తాయని, ఈ నేపథ్యంలో వసతిగృహం పరిసరాల్లో దోమలు ఉత్పత్తి చెందకుండా నీటి నిల్వల లేకుండా చూడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కిటికీలకు మెష్‌లు బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్, ఆరోగ్య సహాయకులు నందకుమార్, హాస్టల్ వార్డన్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. భువనేశ్వరీ అమ్మవారికి విశేష అర్చనలు, అలంకారం, పూజలు నిర్వహించారు. సాయంత్రం విశేష పుష్పాలంకారం జరిగింది. భక్తులు ఆలయం, స్వామివారి వనంలో కార్తీక దీపారాధనలు చేశారు. కార్తీక వనభోజనాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తీక మాస పూజలు కనుల పండువగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు లలితా శివకుమార్ ఆధ్వర్యంలో విద్యా సమేత నాగేశ్వరస్వామిలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరికి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకారం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, గౌరవ సలహాదారుడు ఎంపీ ఆంజనేయులు, ట్రస్టీలు పర్యవేక్షించారు.

● నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి వార్లకు కార్తీక మాసం, శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. చండీహోమం, రాజరాజేశ్వరికి రాహుకాల పూజలు, కార్తీక దీపారాధనలు జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం కుంభహారతులు, పల్లకీసేవలు జరిగాయి. ఈ కార్యక్రమాలను జిల్లా సహాయక కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.

● బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో మరకత గణపతికి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం అభిషేక మహోత్సవం కనుల పండువగా జరిగింది. బృందావనం శ్రీనివాస దీక్షితులు వైఖానస ఆగమ పద్ధతిలో పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి, పంచ, అష్ట, నవ, నక్షత్ర, కుంభ హారతులు సమర్పించారు. వికాస్ ప్రజాహిత సేవా సమితి తరఫున కర్తం ప్రతాప్‌రెడ్డి దంపతులు మహిళా భక్తుల కోసం శ్రీదేవి భూదేవి అమ్మవారి పాదాల వద్ద ఉంచిన చీరలను, పురుషులకు స్వామివారి వస్త్రాలు లక్కీడిప్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, సెక్రటరీ రత్నం, ట్రెజరర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


బాలాజీనగర్ సీతారామ మందిరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామికి తిరుమంజనం సేవలో అర్చకులు

నర్సుల విజ్ఞానం, నైపుణ్యం పెంపునకే జాతీయ సదస్సు

- ఏపీ నర్సింగ్ మిడ్ వైఫనరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ సుశీల


నర్సింగ్ జాతీయ సదస్సులో పాల్గొన్న రిజిస్ట్రార్‌తో పాటు అధ్యాపకులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నర్సులు తమ విజ్ఞానం, నైపుణ్యం పెంచుకునేందుకు నర్సింగ్ జాతీయ సదస్సు ఉపయోగపడుతుందని ఏపీ న ర్సింగ్ మిడ్‌వైఫనరీ కౌన్సి ల్ రిజిస్ట్రార్ వీ.సుశీల పేర్కొన్నారు. శుక్రవారం నారాయణ నర్సింగ్ కళాశాలలో జరుగుతున్న న ర్సింగ్ జాతీయ ముగింపు సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. నర్సింగ్ విద్యార్థులకు ఇచ్చే కొన్ని క్రెడిట్ అవర్స్ వల్ల ఐదేళ్లకు ఒకసారి జరిగే నర్సింగ్ రిజిస్ట్రేషన్‌లలో ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నర్సిం గ్ కళాశాలలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించేలా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. ఈ జాతీయ సదస్సుకు 750 మందికి పైగా పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. నారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజకుమారి మాట్లాడుతూ ఆధునిక పరికరాలు, విధానాలకు అనుగుణంగా అవగాహన పెంచుకోవడంపై ముఖ్యులు వివరించారన్నారు. ప్రత్యే క అతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత విజ్ఞాన, సృజనాత్మక అన్న అంశంపై ప్రతిభ చూపిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్, డాక్టర్ పెంచలయ్య, అరుణ, అంజలీదేవి, సుచిత్ర, ప్రతిమ, ఉషాకిరణ్, తేజోవతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నేచర్ ఈవెంట్స్ ఎక్స్‌పో

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని మినీబైపాస్ రోడ్డు పరమేశ్వరి కల్యాణ మండపంలో శనివారం నుంచి నేచర్ ఈవెంట్స్ ఎక్స్‌పో జరుగుతుందని నిర్వాహకులు కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులు ప్రజలకు ఆరోగ్యాన్ని ఇస్తాయని, దీనిపై అవగాహన కల్పించేందుకు ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు పాల్గొంటారని తెలిపారు. నగరవాసులు అందరూ తరలిరావాలని కోరారు.

ఆధ్యాత్మికతతోనే పరిపూర్ణత

● తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి

● లక్ష దీపోత్సవంలో భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక సాధన లేనిదే జీవితం పరిపూర్ణం కాదని, కార్తీక మాసంలో నిష్ఠగా స్నానం ఆచరించి ఉసిరి వృక్షం ఉన్నచోట దీప ప్రజ్వలన చేయడం అత్యంత శ్రేష్ఠమని తుని శ్రీతాండవ కాశీ క్షేత్ర తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఉద్బోధించారు. నెల్లూరులోని వీఆర్ ఉన్నతపాఠశాల మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అజ్ఞానాన్ని నివృత్తి చేసుకోవాలంటే దీపారాధన మార్గమన్నారన్నారు. అలాంటి పుణ్యకార్యంలో ప్రజ లను భాగస్వాములను చేస్తున్న వేమిరెడ్డి దంపతులు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలను అభినందించారు. కాగా, లక్ష దీపోత్స వంలో భాగంగా శుక్రవారం ఉదయం రుద్ర హోమం, 108 మంది దంపతులతో మహాలక్ష్మీ అమ్మవారి లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొ న్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పండరినాథ స్వామికి లక్ష మల్లెలు, లక్ష తులసీదళాలతో అర్చన చేశారు. ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన స్ఫటిక లింగానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష దీపోత్సవం వంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులు నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వీఆర్సీ మైదానంలో శనివారం నిర్వహించనున్న శివపార్వతుల శాంతి కల్యాణోత్సవానికి సంబంధించి శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవమూర్తులతో కూడిన ప్రచార రథం శుక్రవారం నెల్లూరు చేరింది. దాని కి వేమిరెడ్డి దంపతులు, శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు వేమిరెడ్డి కోటారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.



అనుగ్రహ భాషణ చేస్తున్న తపోవన పీఠాధిపతి, చిత్రంలో దేవదాయ మంత్రి ఆనం, వేమిరెడ్డి దంపతులు తదితరులు

క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలి : వీఎస్‌యూ వీసీ

కావలి (టౌన్) నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ వీఎస్‌యు పీజీ కళాశాల ఆధ్వర్యంలో మహిళా అంతర్ కళాశాలల క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరయ్యారు. రిజిస్ట్రార్ కె సునీత, డీన్ రమణారెడ్డితో కలిసి వీసీ క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులను ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ స్థాయి క్రీడాపోటీలకు పంపించి ప్రోత్సహిస్తున్నామన్నారు. వాలీబాల్, బాల్‌బ్యాట్మింటన్, ఖోఖో, చదరంగం తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. శనివారంతో పోటీలు ముగియనున్నాయని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వీఎస్‌యు జట్లకు ఎంపిక చేస్తారని ఆర్గనైజింగ్ సెక్రటరీ మణికంఠ తెలిపారు. క్రీడాపోటీల అబ్జర్వర్ అమ్మాజీ, యూనివర్శిటీ సీనియర్ పీడీలు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

కలెక్టరేట్‌ను మోడల్‌గా తీర్చి దిద్దుతాం

● లిఫ్టు ప్రారంభంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతామని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు లిఫ్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అత్యాధునిక సాంకేతికతతో ప్రజలకు అవసరమైన అన్నీ వసతులను సమకూర్చుతామని వివరించారు. కలెక్టర్ ఛాంబర్ మొదటి అంతస్తులో ఉండటం వలన చాలా మంది తనను కలిసేందుకు వృద్ధులు, అనారోగ్య కారణాలతో వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వారి కోసమే ఈ లిఫ్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, కలెక్టరేట్ ఏవో తుమ్మా విజయకుమార్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నారులకు మంచి పోషణ అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. వయసుకు తగ్గ బరువు ఉండేలా చూడాలన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహహింసకు పాల్పడుతున్న వ్యక్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏ మహిళకు అన్యాయం జరుగకుండా వన్‌స్టాప్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ సమీక్షలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, బాలల సంరక్షణ అధికారి సురేష్, నోడల్ అధికారి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

రేడియాలజిస్టుల కొరత తీరేదెప్పుడు?

● 197 సెంటర్లకుగానూ 25 మందే..

● నేడు ప్రపంచ రేడియాలజీ దినోత్సవం

● వ్యాధుల గుర్తింపులో వాళ్లే కీలకం

● ప్రభుత్వాసుపత్రుల్లో పోస్టుల ఖాళీ

● ఐదు సీట్లు కావాలంటున్న ప్రభుత్వ వైద్యకళాశాల

నెల్లూరు (వైద్యం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో రేడియాలజిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రాణాంతక వ్యాధులను నిర్ధారించాలన్నా వీరి అవసరం ఎంతైనా ఉంది. అయితే జిల్లాలో అనుకున్న స్థాయిలో మాత్రం వీరులేరు. ప్రత్యేకించి ప్రభుత్వరంగ సంస్థల్లో వీరిలోటు చాలా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 8న (నేడు) ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రపంచ రేడియాలజీ సొసైటీ తీర్మానించింది.

● ఉన్నది ఆరుగురే...

జిల్లావ్యాప్తంగా 52 పీహెచ్‌సీలతోపాటు 10 సీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే నెల్లూరులోని జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరులో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రులలో కేవలం ఆరుగురే రేడియాలజిస్టులు ఉన్నారంటే వీరి కొరత ఎలా ఉందో తెలుస్తోంది. ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐదు రేడియాలజీ పీజీ సీట్లకు అనుమతి కావాలని ప్రభుత్వానికి గత ఏడాది వైద్యాధికారులు నివేదికలు పంపారు. అయితే ప్రభుత్వం సీట్లు కేటాయించ లేదు. కొన్ని వ్యాధులకు సంబంధించి రేడియాలజిస్ట్ కొరత కారణంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి మహా నగరాలకు వైద్యులు రెఫరల్ కోసం పంపిస్తుంటారు. ఆయా పరీక్షల ఫలితంగా వైద్య నిపుణులు చికిత్సలు అందిస్తున్నారు.

● 197 సెంటర్లకుగానూ 25 మందే..

జిల్లా వ్యాప్తంగా 197 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. అయితే రేడియాలజిస్టులు మాత్రం 25 మందే ఉన్నారు. 80 మంది రేడియాలజిస్టులు అవసరం ఉన్నా, వీరి కొరత ఎక్కువగానే ఉంది. నెల్లూరు జీజీహెచ్‌లోని స్కానింగ్ సెంటర్‌లో ఓ ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఉన్నారు. ఓ రెసిడెంట్ రేడియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారు. అయితే ఈ ఆరుగురిలో ఇద్దరు వివిధ కారణాల తో సెలవులో ఉన్నారు. ఇక్కడ వైద్యకళాశాలకు మరో ఐదు పీజీ రేడియాలజీ సీట్లు కేటాయిస్తే, ఇక్కడ రోగులకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ప్రతి రోజూ జీజీహెచ్‌లోని స్కానింగ్ సెంటర్‌లో 30 ఎమ్మారై, 60 సిటీస్కాన్, అల్ట్రాసౌండ్ 200, ఎక్స్‌రేలు మరో 200 తీస్తున్నారు. వీటన్నిటి రిపోర్టులను రేడియాలజిస్టేలే రాస్తుంటారు. ఇక్కడ ల్యాబ్ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఒక్కోసారి రిపోర్టులు రావాలంటే 3 నుంచి 4 రోజులు పడుతుంది. దీంతో రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో రేడియాలజిస్టుల అవసరం ఎంతైనా ఉంది.



కొరత చాలా ఎక్కువే...



జీజీహెచ్ స్కానింగ్ సెంటర్‌లో రేడియాలజిస్టుల కొరత చాలా ఎక్కువగా ఉంది. దీంతో పలు వ్యాధులకు సంబంధించి రిపోర్టుల తయారీలో ఎంతో ఒత్తిడికి గురవుతున్నాం. ప్రభుత్వ వైద్యకళాశాలకు మరో ఐదు పీజీ సీట్లు కేటాయిస్తే కొంత వరకు కొరత తీరుతుంది.

\- డాక్టర్ వెంపులూరి కుసుమ, రేడియాలజిస్ట్, జీజీహెచ్

త్వరగానే నివేదికలు అందిస్తున్నాం



ఎమ్మారై, సిటీస్కాన్, అల్ట్రాసౌండ్ రిపోర్టులను ప్రతి రోజూ తీస్తున్నాం. ఈ నేపథ్యంలో ఎంతో ఒత్తిడికి గురవుతున్నా, రిపోర్టులను సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నాం. దీంతో ఎక్కువ సమయం జీజీహెచ్‌లోనే గడపాల్సి వస్తుంది. ఈ క్రమంలో రేడియాజిస్టులతోపాటు సహాయకులను కూడా నియమించాలి.

\- డాక్టర్ మణికంఠ, జీజీహెచ్ స్కానింగ్ సెంటర్ రేడియాలజిస్ట్

జాయింట్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

● వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ ఆఫీసు సబార్డినేట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త పిలుపు మేరకు నాయకులు నెల్లూరు జోన్ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, కావలి వాణిజ్య పన్నులశాఖ కార్యాలయాల ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింగరావు, కార్యదర్శి జే.సుజాతాబాయి మాట్లాడుతూ చిత్తూరు డివిజన్‌లో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ దళిత వర్గానికి చెందిన ఇద్దరు ఆఫీసు సబార్డినేట్లను కులం పేరుతో దూషించడమేకాక, చేయిచేసుకున్నారని ఆరోపించారు. ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆఫీసు సబార్డినేట్లకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వీ. యానాది, ఉపాధ్యక్షుడు బీ.బాలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈ అనిల్, సంయుక్త కార్యదర్శి వీ.మధుసూధన్‌రావు, ట్రెజరర్ ఎస్‌కే రియాజ్, తదితరులు పాల్గొన్నారు.



కావలిలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు

ఉత్కంఠ.. ఉద్వేగం..!

● హోరాహోరీగా హాకీ పోటీలు

● ఏసీ స్టేడియం జట్లకు ప్రథమస్థానం

నెల్లూరు(విద్య), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. మ్యాచ్‌లన్నీ కూడా ఉత్కంఠ భరితంగా.. ఉద్వేగంగా జరిగాయి. భారత హాకీ శతజయంతోత్స వాలను పురస్కరించుకుని జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం జరిరిగాయి. జిల్లా వ్యాప్తంగా పలు క్రీడా జట్లు, క్లబ్‌లు తలపడగా పురుషుల విభాగంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం జట్లు ప్రథమస్థానం, మిక్స్‌డ్ జిల్లా జట్లు ద్వితీయస్థానం సాధించాయి. మహిళల విభాగంలో మాదరాజు గూడూరు ప్రథమస్థానం, శ్రీకొలను జట్టు ద్వితీయస్థానం దక్కించుకున్నాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు అందచేశారు. అనంతరం సీనియర్ క్రీడాకారులను, కోచ్‌లను ఘనంగా సత్కరించారు. పోటీలకు ముందుగా శతజయంతిని పురస్కరించుకుని హాకీ సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులు మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో పాండురంగారావు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, కార్యదర్శి గురుప్రసాద్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు గాదం వాసు, హాకీ సంఘం జిల్లా కార్యదర్శి పీ.జగన్మోహన్, డాక్టర్ పీ.రవికుమార్, డాక్టర్ బాబు అగస్టీన్, డీఎస్ఏ హాకీ కోచ్ చందు, సీనియర్ క్రీడాకారులు కమల, కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానం సాధించిన పురుషుల జట్టు

పీఎంఎంఎస్‌వై లబ్ధిదారులుగా 191 మంది ఎంపిక

● మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) కింద జిల్లాలో 191 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కే.శాంతి తెలిపారు. శనివారం మత్స్యశాఖ కార్యాలయంలో పీఎంఎంఎస్‌వై పథకం జిల్లాస్థాయి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకం అమల్లో భాగంగా వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆధ్వర్యంలో చర్చించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆమోదించామన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని లీడ్ డిస్ట్రిక్ మేనేజరుకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ.లలితాశివజ్యోతి, నీటిపారుదల, డీఆర్‌డీఏ శాఖల అధికారులు, మత్స్య కళాశాల ప్రొఫెసర్లు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

సర్పంచుకు షోకాజ్ నోటీసు

చేజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి చెందిన నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో చేజర్ల మండలం యనమదల గ్రామ పంచాయతీ సర్పంచ్ నోటి సుందర య్యకు గురువారం జిల్లా పంచాయతీ అధికారులు షోకాజ్ నోటీసు జారీచేశారు. పూర్తి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బొగ్గల తిరపతిరెడ్డి ఫిర్యాదు మేరకు పంచాయతీశాఖ అధికారులు గ్రామంలో విచారించిన అనంతరం ఆర్వో ప్లాంటు నిధులు దుర్వినియోగం అయ్యాయని, సదరు పంచాయతీ సర్పంచ్ నోటి సుందరయ్యకు మూడు నెలల పాటు సర్పంచ్‌గా ఎందుకు సస్పెండ్ చేయకూడదో 15 రోజులలో వివరణ సమర్పించవలసిందిగా షోకాజ్ నోటీసును జారీచేశారు. లేకపోతే ఏపి పిఆర్ యాక్ట్ 1994 సెక్షన్ 249(6) నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని షోకాజ్ నోటీసులో తెలియజేశారు.



విజేతలతో డీఈవో, అధికారులు

అబ్బురపరచిన ఒకేషనల్ ప్రదర్శనలు

● రాష్ట్రస్థాయికి పది ట్రేడ్ల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు వృత్తివిద్యా కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించేలా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షల ఆధ్వర్యంలో నగరంలోని సంతపేట సెయింట్‌జాన్స్ పాఠశాలలో శుక్రవారం ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో జిల్లాస్థాయి స్కిల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని 49 పాఠశాలల్లో పది ట్రేడ్‌లలో ప్రత్యేక శిక్షణ అందిస్తుండగా 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు పదివేల మందికిపైగా శిక్షణ పొందుతున్నారని చెప్పారు. వారు పొందిన శిక్షణతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని, దీనిలో ఎంతో మంది విద్యార్థులు ఆయా విభాగాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తిలకించి వారిని అభినందించారు.

● విజేతలు వీరే..

వృత్తి విద్యాకోర్సుల ప్రదర్శనల పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 500 మంది విద్యార్థులు 150 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిని పరిశీలించిన అధికారులు ఉత్తమ ప్రదర్శనలను విజేతలుగా ప్రకటించి రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. ఐటీ విభాగంలో దుత్తలూరు ఏపీ మోడల్ స్కూల్, ఎలక్ట్రానిక్స్‌లో రేవూరు జడ్పీ ఉన్నత పాఠశాల, బీఎఫ్‌ఎస్‌ఐలో ఇందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల, రిటైల్‌లో కేఎన్‌ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, అగ్రికల్చరల్‌లో కలువాయి వీవీఎస్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల, బ్యూటీ అండ్ వెల్‌నెస్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆపేరల్‌లో కేఎన్‌ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆటోమోటివ్‌లో ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హెల్త్‌కేర్‌లో కరేడు జడ్పీ ఉన్నత పాఠశాల, ఫుడ్ ప్రాసెసింగ్‌లో కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలు ప్రథమస్థానాలు సాధించి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

పొదలకూరు పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ గ్రేడ్-4, పంచాయతీ కార్యదర్శి ఎం యశ్వత్‌సింగ్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీలో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో హౌస్ ట్యాక్స్ మాడ్యూల్‌లో ఇళ్లకు సంబంధించిన అసెస్మెంట్ నెంబర్లకు ఒకే మొబైల్ నెంబరును పంచాయతీ కార్యదర్శి తప్పుగా అనేక అసెస్మెంట కు అప్‌డేట్ చేశాడు. దీంతో ఏపీసీఎస్ (సీసీఅండ్ఏ) రూల్-8 కింద అతడిని జిల్లా కలెక్టర్ విధుల నుంచి అతడిని తప్పించారు. యశ్వంత్ సింగ్ మండలంలోని మర్రిపల్లి గ్రామ పంచాయతీకి రెగ్యులర్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

ప్రజా ప్రయోజనాల కోసమే పరిశ్రమలు

● భూములివ్వాలని రైతులకు జేసీ సూచన

కావలి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు ఏ ఒక్కరి ప్రయోజనం కోసమో కాదని, ప్రజల ప్రయోజనాలకే ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. పరిహారం తీసుకుని పరిశ్రమలకు అవసరమైన భూములు ఇవ్వా లని రైతులను కోరారు. కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం రామాయపట్నంపోర్టు అనుబంధ పరిశ్రమలకు కావలి రూరల్ మండలం చెన్నాయపాళెం, పెదపట్టుపుపాళెం ప్రాంతాల్లో 2,190 ఎకరాల భూసేకరణ అంశంపై రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పరిహారం ఇస్తామన్నారు. గుడ్లూరు మండలం రావూరులో ఎకరాకు రూ.12.5 లక్షలు నిర్ణయించగా, అక్కడి రైతుల డిమాండ్ మేరకు ఎకరాకు రూ. 20 లక్షలు ఇచ్చామన్నారు. ఈ ప్రాంతం పరిశ్రమలకు అనుకూలమని ప్రభుత్వం పరిశ్రమలు మంజూరు చేసిందని, ఇక్కడి రైతులకు కూడా ఇదే ధర ప్రకారం పరిహారం ఇస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూములు తీసుకోవటం తప్ప ప్రత్యమ్నాయం లేదన్నారు. దానిపై స్పందించిన రైతులు భూములను నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న తమకు.. ఆ భూములు పోతే జీవనాధారం కరువవుతుందన్నారు. వ్యవసాయ భూముల్లో రెండు పంటలు సాగు చేస్తున్నందున రైతులే కాకుండా అనేకమంది కూలీలు, వ్యాపారులకు కూడా ఉపాధి లభిస్తోందన్నారు. పరిశ్రమలకు భూములు తీసుకుని ఏ కొద్ది మందికో ఉద్యోగాలు ఇస్తే.. మిగతా వారు ఎలా బతకాలని రైతులు ప్రశ్నించారు. మొదట తమకు ఉపాధి అవకాశాలు చూపించి ఆ తర్వాత భూములు తీసుకోవాలని, లేనిపక్షంలో భూములు ఇవ్వబోమని చెప్పారు. అందుకు జేసీ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మారిటైంబోర్డు డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

గ్రామీణ బ్యాంకులో నకిలీ నోటు కలకలం

ఉదయగిరి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో శుక్రవారం రూ. 500 నకిలీ నోటు కలకలం సృష్టించింది. సమీప సున్నంవారి చింతల గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పొదుపు సంఘానికి సంబంధించిన రుణ బకాయిలు బ్యాంకులో జమ చేసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న ఓ యువకుడితో రూ. 50వేలకు సంబంధించిన డిపాజిట్ ఫారమ్ రాయించుకొని క్యాషియర్ అజయ్ వద్దకు వెళ్లి నగదు అందజేసింది. దీంతో ఆ నగదును క్యాష్ కౌంటింగ్ మిషన్‌లో లెక్కించేందుకు ఉంచగా నకిలీ నోటు వెలుగు చూసింది. దీంతో ఆయన ఆ నోటును నకిలీగా నిర్ధారించి విషయాన్ని వృద్ధురాలికి తెలిపి మరో రూ.500 ఇవ్వాలని సూచించారు. ఆ సమయంలో ఆమె వద్ద నగదు లేకపోవడంతో చేసేదేమిలేక వెనుతిరిగి వెళ్లిపోయింది. మిగిలిన ఖాతాదారులు సైతం విషయం తెలుసుకొని విస్తుపోయారు. కాగా, ఈ విషయమై క్యాషియర్‌ను సంప్రదించగా నకిలీ నోటు తమ వద్దకు వచ్చిన విషయం వాస్తవమేనని, మిగిలిన వివరాలు తాను తెలుసుకోలేదని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పీ.సత్యవాణి పిలుపునిచ్చారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యునిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) కింద ఇన్‌టర్నల్ కమ్యునిటీ రీసోర్స్ పర్సన్స్(ఐసీఆర్‌పీ)లకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి తమ పూర్తి సహకారం ఉంటుందని, ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజ్‌కుమార్, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజరు మునిరత్నంలు వ్యవసాయ సూత్రాలు, వ్యవసాయ శాస్త్రీయ విస్తృత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులు వారి అనుభవాలను పంచుకున్నారు.

పోలీసులు సిబ్బంది సంక్షేమానికి వెల్ఫేర్ డే

● ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం కోసం ప్రతి శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది వారి సమస్యలను తనకు నిర్భయంగా తెలియజేసుకోవచ్చని తెలిపారు.

ఉపాధి హామీ గ్రామసభ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉపాధిహామి పథకం పనులకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈసీ ఆనందం మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో గ్రామసభ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్, ఎఫ్ఏ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11546
వెండి కిలో ధర	రూ. 152900
వెండి ఒక గ్రాము	రూ. 158.90

న్యూస్ బాక్స్

ఉపాధ్యాయులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసులు

ఉదయగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను అనుసరిస్తూ విద్యాబోధన చేస్తే విద్యార్థుల అభ్యసన ఫలితాలు మెరుగుపర్చవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్, రిసోర్సుపర్సన్‌లు నాయబ్, కరీ ముల్లా, అరాఫత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆత్మకూరు డివిజన్ స్థాయిలో 9 మండలాల పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ట్రైనర్లు పి విజయ కుమార్, నరసింహులు మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో తెలుసుకున్న అంశాలను అమలుపరుస్తూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి రఫీఖాన్, డిప్యూటీ ఎంపీడీవో భువనేశ్వరీ, అనంతసాగరం, ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు, సీతారామపురం, ఉదయగిరి, కలువాయి, చేజర్ల, సంగం మండలాలకు చెందిన పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్, గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం

సంగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ఆధ్వర్యంలో స్కౌట్స్, గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ క్రమశిక్షణకు, దేశభక్తికి మారుపేరన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో నిర్వహించిన ఐటీ ట్రేడ్ నైపుణ్య పోటీల్లో ప్రతిభ చాటి దుత్తలూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు తగిన శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యేందుకు కృషి చేసిన వృత్తి విద్యా నిపుణుడు నరేష్‌ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్‌ను ఏపీసీ వెంకటసుబ్బయ్య, జీసీడీవో మమత అభినందించి మొమెంటో అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రతి ఎకరాకు 3 బస్తాల యూరియా పంపిణీ

సంగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పొలం కలిగిన ప్రతి రైతుకు కార్డులు అందచేసి ప్రతి ఎకరాకు మూడు బస్తాల చొప్పున యూరియా అందచేస్తున్నామని వ్యవసాయాధికారి శశిధర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల ద్వారా 200 మెట్రిక్ టన్నులు, సంగం, దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీలు) ద్వారా 72 మెట్రిక్ టన్నులు, గ్రోమోర్ కేంద్రం ద్వారా మరో 68 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములు సాగుచేస్తున్న రైతులకు కూడా వీఏఏలను సంప్రదించితే యూరియా కార్డులు అందచేస్తారని తెలిపారు. మండలంలో కొంతమంది రైతులు నారుమళ్లు వేస్తున్నారని, మరికొంతమంది నారుమళ్లు వేయకపోయినా ముందుస్తుగా యూరియా పంపిణీ చేశామన్నా రు.

ఏఎస్‌పేట మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఏఎస్ పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా పడింది. సమావేశానికి ఎంపీపీ తప్ప మిగిలిన ఎంపీటీసీలు ఎవరూ హాజరుకాలేదు. దీంతో సమావేశం వాయిదా వేశారు.



ఆత్మకూరు: వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో పావని



సంగం: వందేమాతరం గీతాలాపన చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ఏఎస్‌పేటలో వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఎస్ఐ సైదులు తదితరులు

విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలి : ఆర్డీవో

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆర్డీవో బి పావని సూచించారు. వందేమాతరం గీతం రచించి ఆలపించి 150ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని గురుకుల పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి జాతీయగీతం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వందేమాతరం గీత రచయిత బంకింగ్‌చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులతో కలిసి వందేమాతం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ జి గంగాధర్, డిప్యూటీ డీఈవో ఎం జానకీరామ్, గరుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వందేమాతరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి వందేమాతరం గీతాలపన చేశారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట:** ప్రతి ఒకరూ దేశభక్తి కలిగి ఉండాలని ఎస్ఐ సైదులు సూచించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అదేవిధంగా తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు అనిల్‌కుమార్ వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఠాగూర్ పాఠశాల, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.

●**ఉదయగిరి :** వందేమాతరం గీతం ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలో పోలీసులు, అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి మెయిన్‌బజార్ గుండా బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి వందేమాతరం గీతం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రార్థనా సమయంలో వందేమాతరం గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు జీ.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు:** దుత్తలూరులో అధికారులు విద్యార్థులచే ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెంచమ్మ, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** వందేమాతరం వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ రఘునాథ్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల నుంచి జాతీయ రహదారి మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోనూ వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

●**సీతారామపురం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాద్ ఆధ్వర్యంలో మండల నాయకులు, అధికారులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం మన మిత్ర అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా కరపత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటి చైర్మన్ సోమన బోయిన రాజశేఖర్, టిడిపి మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, మండల యువత అధ్యక్షుడు వీకాష్‌బాబు, తోట ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ హసానయ్య, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●**వింజమూరు:** స్థానిక మాశిలామణి వైద్యశాలలో శుక్రవారం వందేమాతరం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె మాసిలామణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, హెప్సిబా, షాలిని, మల్లికార్జున్, శాంతి, కీర్తి, దీనా, ప్రేమలీల, తిరుమలేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



వరికుంటపాడు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు



సీతారామపురంలో మన మిత్ర కరపత్రాలను అందజేస్తున్న అధికారులు

ఎన్జీ రంగాకు ఘన నివాళి



ఎన్జీ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్, అధ్యాపకులు

ఉదయగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఎన్జీ రంగా జయంతిని స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్జీ రంగా జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గోపీకృష్ణ, లావణ్యకుమారి, దుర్గాప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య పోటీల్లో ఉదయగిరి విద్యార్థుల ప్రతిభ

ఉదయగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్సుకు సంబంధించి జిల్లాస్థాయిలో శుక్రవారం నెల్లూరులో నిర్వహించిన నైపుణ్య పోటీల్లో ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఒకేషనల్ కోర్సులోని ఆటోమోటివ్ నైపుణ్యంలో పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినులు షేక్ నలేహా, కె.నాగలక్ష్మీ, షేక్ సునీద్, సయ్యద్ అయేషాలు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారన్నారు. అలాగే పదో తరగతి విద్యారినులు అంజలి, అలీషా, మానసలు ఒకేషనల్ కోర్సులోని అపీరియల్ ట్రేడ్ నైపుణ్యంలో జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా ప్రతిభ చాటిన విద్యార్థినులు బహుమతులు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ఉపాధ్యాయులు కిశోర్, నందిని, బయాలజీ ఉపాధ్యాయుడు నారాయణతోపాటు ప్రతిభ చాటిన విద్యార్థులను వారు అభినందించారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసి మెట్టప్రాంత వాసుల కష్టాలు తీర్చాలని శుక్రవారం నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు, టీడీపీ యువ నాయకుడు మార్నేని రామకృష్ణలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో గల ఎనిమిది మండలాలు మూడు డివిజన్ల పరిధిలో ఉండడంతో ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక పోవడంతో పాటు ఎలాంటి అభివృద్ధి జరగడంలేదన్నారు. ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసి అన్ని మండలాలను అందులో విలీనం చేయాలన్నారు. ఆ దిశగా జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

సీతారామపురం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపల్లి అంగన్వాడీ కేంద్రానికి స్థానిక యూత్ కమిటీ నాయకులైన నేదురపల్లి రవి, గొల్లపల్లి భాస్కర్, రమేష్‌లు కలిసి కుర్చీలు, టేబుళ్లను శుక్రవారం వితరణ చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి వందేమాతం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నేలటూరి జాషువా, ఇజ్రాయిల్, ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను, యూత్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల



రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేస్తున ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం దుత్తలూరులోని రైతు సేవా కేంద్రం-1 వద్ద టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి రైతులకు యూరియా, శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సమయానికి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. పంట పెట్టుబడి సాయం కింద రైతులకు నగదు అందజేయడంతోపాటు వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో ఎమ్మెల్యే

మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఅడవి పేరంటాలమ్మ ఆలయంలో శిఖర కలశ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మదన్ మోహన్, సొసైటి సీఈవో లోక్‌నాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు కాకర్ల మధు, సింగవరపు సుబ్బారెడ్డి, కంభం వెంకటేశ్వరరెడ్డి, చుండి అంజిరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహనా ర్యాలీ




సంగం: క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

సంగం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా వైద్య సిబ్బంది వైద్యశాల నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యం ముద్దు, పొగ తాగవద్దు... క్యాన్సర్‌కు గురికావద్దు అంటూ నినాదాలు చేశారు.

●**ఉదయగిరి రూరల్:** మండలం లోని అప్పసముద్రం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సంద ర్భంగా వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిం చారు. హెల్త్ అసిస్టెంట్ ఎండీ మన్సూర్‌అలీ, సీహెచ్‌వో సురేష్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు మైక్రోఫోన్ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే పొగాకు ఉత్పత్తులు, మద్యం వినియోగంతో వ్యాపించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్య లను, వీడియోలను ప్రొజక్టర్ ద్వారా ప్రదర్శిం చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సౌజన్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కృష్ణయ్య, అక్కుల రాజు, మాలకొండయ్య, యశోద, ఆశ కార్యకర్తలు లత, విస్తీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం:** శారీరక శ్రమ లేకుంటే క్యాన్సర్ విస్తరించే ప్రమాదం ఉందని డాక్టర్ స్వప్నరెడ్డి అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కేజీబీవీ స్కూల్‌లో విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించినట్లయితే వంద శాతం నయం చేయవచ్చని తెలిపారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ తరపున ఎన్‌సీడీ-4 సర్వే కార్యక్రమానికి మండల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, కేజీబీవి ప్రిన్సిపాల్ షాజిదా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్

ఉదయగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు కేటాయించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు చెందిన బ్యాంకర్లు, వెలుగు, పశు సంవర్థక, వ్యవసాయ శాఖ అధికారులతో జేఎంఎల్‌బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల రికవరీ నూరుశాతం పూర్తిచేయాలన్నారు. స్వయం సహాయ గ్రూపులు తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రైతులు డెయిరీఫామ్‌ల ఏర్పాటుకు అధిక రుణాలు మంజూరు చేయడంతో పాటు వారు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం బ్యాంకర్లు, ఇతర శాఖల సిబ్బంది సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవిశంకర్, కాశయ్య, జయదేవ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



మనోజ్ (ఫైల్)

కలిగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు సరదాగా సముద్రతీరానికి వెళ్ళి కాసేపు సంతోషంగా గడిపి తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. కాసేపట్లో గ్రామానికి చేరుకుంటారనగా ఇంతలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని పెద్దపాడుగ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెంకు అనుసంధానమైన కొప్పోలువారిపాలెంకు చెందిన కొప్పోలు మనోజ్, తన స్నేహితుడు మురారి పెంచలప్రసాద్, ఇటీవల బెంగుళూరునుండి వచ్చిన పెంచలప్రసాద్ మేనమామ కొడుకు నక్కా కిరణ్‌లు ముగ్గురు కలిసి ఆటవిడుపుకోసం కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్రతీర ప్రాంతానికి ఒకే మోటార్‌సైకిల్‌పై వెళ్ళారు. అక్కడ కాసేపు సరదాగా గడిపి కావలిలో పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. కావలి-కలిగిరి రహదారిలో పెద్దపాడు గ్రామం వద్ద రోడ్డు మలుపు సూచికను వేగంగా ఢీకొనడంతో రోడ్డుకి దూరంగా ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో కొప్పోలు మనోజ్ (25) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వింజమూరు తరలించారు. నక్కా. కిరణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ ఉమాశంకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు తరలించారు. మనోజ్ ఐటీఐ పూర్తిచేసి కొంతకాలంగా స్థానికంగా పనులకు వెళతున్నాడు. కొప్పోలువారిపాలెం గ్రామస్తులు, మనోజ్ కుటుంబసభ్యులు, స్నేహితులు అక్కడికి చేరుకున్నారు. మనోజ్ మృతదేహాన్ని చూసి కన్నీళ్లపర్యంతమయ్యారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించేలా టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, టీడీపీ నాయకుడు కొప్పోలు కొండలరావు సహకారం అందించారు. మనోజ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

మూర్ఛతో గుర్తుతెలియని మహిళ...



గుర్తుతెలియని మహిళ మృతదేహం

నెల్లూరు(క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూర్ఛవ్యాధితో గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన నగరంలోని శెట్టిగుంట రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. మృతురాలు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగి పసుపు, గులాబీ ఆకుపచ్చ రంగు డిజైన్ చీర, లైట్ గ్రీన్ బ్లౌజ్ ధరించి ఉంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకు తరలించారు. ఆ వార్డు వీఆర్‌వో పీ.ఆదిలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నవాబుపేట పోలీసుస్టేషన్‌లో లేదా, 9440796306కు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ జీ.వేణుగోపాల్‌రెడ్డి కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వాశిలి సమీపంలో నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వాశిలి సమీపంలో రోడ్డుపై రెండు ఆటోలు ఢీకొన్నాయి. దాంతో ఒక ఆటో రోడ్డు పక్కనే వ్యవసాయ పనులు చేసుకుంటున్న వాశిలికి చెందిన దాసరి రవికుమార్‌పై పడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సీఐ జి గంగాధర్, ఎస్ఐ షేక్ జిలాని సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డుపై పడి ఉన్న ఆటోను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పక్కకు తొలగించారు. క్షతగాత్రుడు దాసరి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ జిలాని తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన బాలుడు

నెల్లూరు (క్రైం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డు వెంగమాంబవీధిలో వెంకటలక్ష్మి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు లోహిత్ కుమార్ స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం బాలుడు భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు రాలేదు. కుమారుడు కనిపించకపోవడంతో తల్లి చుట్టుపక్కల గాలించినా జాడ తెలియరాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ యత్నం

మనుబోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామపురంలోని గొలగమూడి అనసూయమ్మ ఇంట్లో గురువారం అర్ధరాత్రి ఓ దొంగ చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. అనసూయమ్మ భర్త గతేడాది చనిపోవడంతో నెల్లూరులో కుమారుడి దగ్గర ఉంటోంది. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగ రెండు గేట్ల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. అలికిడి కావడంతో చుట్టుపక్కల ఇళ్లవాళ్ళు అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివరాకేష్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని చాకచక్యంగా దొంగను పట్టుకున్నారు. వెంటనే అనసూయమ్మ ఇంటికి చేరుకుంది. వస్తువులేవీ చోరీకి గురి కాలేదని పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

పొదలకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరి నుంచి నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను విజిలెన్స్ సీఐ సుభానీ, పౌర సరఫరాలశాఖ డీటీ ఇండ్ల రవి పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మరుపూరు గ్రామం వద్ద మహీంద్రా మ్యాక్స్ వాహనంలో 111 ప్లాస్టిక్ బ్యాగుల్లో 4170 కేజీల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం విలువ సుమారు రూ. 2లక్షలు, వాహనం విలువ రూ.9 లక్షల మేర ఉంటుందన్నారు. వాహన యజమాని సతీష్, డ్రైవర్ సాల్మన్‌పై కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 585

పాఠశాల అభివృద్ధికి ఆర్టీసీ ఉద్యోగి విరాళం

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న గోళ్ల మాధవరావు తన స్వగ్రామమైన వెంకటాద్రిపాలెం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం రూ.35వేలు విరాళంగా అందించారు. పాఠశాల భవనానికి రంగులు, ముందు ఇనుపగ్రిల్స్ ఏర్పాటుకోసం ఈ మొత్తాన్ని వెచ్చించాలని చెక్కును శుక్రవారం హెచ్‌ఎం మృదులకు అందించారు.


హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగి గోళ్ల మాధవరావు

తలసీమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ సేవలు అపురూపం


పౌష్టికాహారం అందచేస్తున్న కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి దంపతులు

కావలి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తలసీమియా పీడిత చిన్నారులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అపురూపమైనవని కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య కొనియాడారు. శుక్రవారం అలేఖ్య, శ్రీకాంత్ దంపతులు స్థానిక రెడ్‌క్రాస్ తలసీమియా డే కేర్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఏడుగురు చిన్నారులకు మందులు, పౌష్టికాహారం అందజేశారు. చిన్నారుల తల్లి తండ్రులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ప్రారంభించిన ఈ డే కేర్ సెంటర్ పలువురు చిన్నారులను ఆదుకుంటోందన్నారు. ఈ సెంటర్‌కు స్థానికంగానే కాకుండా ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి కూడా తలసీమియా చిన్నారులు చికిత్స కోసం వస్తున్నారన్నారు. వారికి రక్తం, మందులు, పౌష్టికాహారం ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ సెంటర్‌కు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, వైస్ చైర్మన్ కే. హరినారపరెడ్డి, బ్లడ్ బ్యాంకు వైద్యాధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయం, సాయిమందిరం ప్రారంభం

ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల


ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్లకు వేదమంత్రాలతో ఆశీర్వాదం ఇస్తున్న పూజారులు

జలదంకి, నవంబర్7(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం సోమవరప్పాడులో శుక్రవారం సోమేశ్వర ఆలయం, సాయిమందిరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ నిర్మాణ దాతలు చేవూరి జనార్దన్ రెడ్డి, సులోచనమ్మ దంపతుల చేతుల మీదుగా శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొని వేదపండితుల ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు ఆలయాలను ఒకేసారి నిర్మించి గ్రామంలో ఆధ్యాత్మికశోభను నింపిన చేవూరి జనార్దన్‌రెడ్డి, సులోచనమ్మలు అభినందనీయులన్నారు. మహాశివుడు, షిరిడీ సాయిబాబా ఆశీస్సులు ఆలయ నిర్మాణకర్తలతో పాటుగా ప్రజలందరికీ ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు వేదపండితులు రఘుస్వామి, కళ్యాణ్‌స్వామి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు భజనలు చేశారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొండాపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలిగిరి ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడవళ్లూరు, కొమ్మి, తూర్పుఎర్రబల్లి మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. బెల్టు దుకాణాలలో మద్యం అమ్ముతున్నట్లయితే 9440902523 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

అంకమ్మ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంత ప్రజల ఇలవేల్పు అంకమ్మ ఆలయాన్ని భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకే కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ ఆలయానికి కనీస ఆదాయం లేక కరెంటు బిల్లులు కూడా కట్టలేని దుస్థితి ఉండేదని ప్రస్తుతం నిర్మిస్తున్న రూముల వల్ల ప్రతినెలా రెండున్నర లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుందన్నారు. 24 షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా 19 గదుల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన అభివృద్ధి పనులన్నీ సవ్యంగానే పూర్తవుతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రోడ్ల విస్తరణ చేపట్టామని, సెంటర్ డ్రైనేజి వ్యవస్థను తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, మంచిరాజు మురళి, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ల రవిచంద్ర, మంగపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● **అధికారులంతా విజన్ యాక్షన్ ప్లాన్‌తో పనిచేయాలి**

అధికారులంతా 2047 విజన్ యాక్షన్‌ప్లాన్ ప్రకారం పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రంగా కృషిచేస్తున్నారని అందుకనుగుణంగా అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎంపీడీఓ రత్నజ్యోతి, యంగ్ ప్రొఫెషనల్ అనిల్‌కుమార్, విజన్ స్టాఫ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **పలు కుటుంబాలు టీడీపీలో చేరిక**

కందుకూరు పట్టణానికి చెందిన సీనియర్ వైసీపీ నేత గొర్రెపాటి శ్రీనివాసరావు, ఆయన వెంట పలు కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆపార్టీని వీడి టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **న్యాయం చేయాలని వ్యాపారుల వినతి**

లక్షల రూపాయలు అడ్వాన్సులు చెల్లించటమే గాక నెలనెలా క్రమం తప్పకుండా అద్దె చెల్లిస్తూ వ్యాపారాలు చేసుకుంటున్న తమను అకస్మాత్తుగా ఖాళీచేయించటంతో తీవ్రంగా నష్టపోతున్నందున న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీఎస్ఎన్ఎల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి విజ్ఞప్తిచేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యేను మొబైల్‌షాపుల యూనియన్ ప్రతినిధులతో కలిసి వ్యాపారులంతా తమగోడు వినిపించారు. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 10 షాపులు ఉండగా అందులో నాలుగు మొబైల్‌షాపులే ఉన్నాయని, అయితే మూడు రోజులక్రితం మున్సిపల్ అధికారులు పోలీసు బందోబస్తుతో తమ దుకాణాలు ఖాళీచేయించి రూములకు తాళాలు వేయటంతో తాము రోడ్డున పడ్డామని వాపోయారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణ సమయంలోనే ఇష్టానుసారం వ్యవహరించారని, దీంతో సమస్యలు వచ్చాయని వీలైనంత వరకు మీకు న్యాయం జరిగేలా కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు.


అంకమ్మ దేవాలయం ప్రాంగణంలో నిర్మించిన షాపులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

జాతి ఐక్యతకు ప్రతీక సర్దార్ వల్లభాయ్ పటేల్


ఐక్యతా పాదయాత్రలో ఆర్డీవో వంశీకృష్ణ, ఎన్‌వైకే కోఆర్డినేటర్ మహేంద్ర రెడ్డి

కావలి (టౌన్) నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతి ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతీక అని ఆర్డీవో వంశీకృష్ణ పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్ర (ఎన్‌వైకె) ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఐక్యతా పాదయాత్ర నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఎన్‌వైకె జిల్లా కోర్డినేటర్ మహేంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో ముందడుగు వేయాలన్నారు. మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ దేశ పురోగతికి యువత ప్రధాన శక్తి అన్నారు. ఆర్డీవో జెండా ఊపి ఐక్యతా పాదయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కందుకూరి సత్యనారాయణ, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, ఎన్జీవోలు అబ్దుల్ అలీం, రెహమాన్, దిలీప్, చేవూరి చిన్నా, జమీర్, ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వందేమాతరం దినోత్సవం


వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్తున్న అధికారులు, విద్యార్థులు



కందుకూరులో వందేమాతరం దినోత్సవంలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది


కావలిలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ రాజేశ్వరరావు

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వందేమాతరం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కందుకూరు డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పట్టణ పోలీసుస్టేషన్‌లో విద్యార్థినీ విద్యార్థులచే గీతాలాపన చేయించారు. కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాషా, పట్టణ ఎస్ఐ శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలోను ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మి ఆధ్వర్యంలో వందేమాతరం దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీఐ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు రవికుమార్ ఆధ్వర్యంలో వందేమాతరం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వలేటివారిపాలెం : వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వలేటివారిపాలెంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు సెంటరు వరకూ ర్యాలీ చేశారు. ఈర్యాలీలో ఎంపీడీఓ శంకర్‌రావు, ఈఓఆర్డీ వెంకటనారాయణ, ఏఎస్ఐ బ్రహ్మయ్య, చుండి మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కావలి రూరల్ : భారత స్వాతంత్ర్యోద్యమంలో విశిష్టమైన దేశభక్తి గీతంగా వందేమాతర గీతం నిలిచిందని సీఐ జీ రాజేశ్వరరావు పేర్కొన్నారు. వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో వాసు పాఠశాల విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. భారతీయులందరినీ ఏక తాటిపైకి తెచ్చిన భావోద్వేగపూరితమైన చైతన్య గీతంగా వందేమాతర గీతాన్ని సీఐ అభివర్ణించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాజీబాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కావలి : 'అహింసాయుత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సమరయోధుల రణనినాదం వందే మాతరం' అని నెల్లూరు జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షమీమ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుమేరకు ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో గ్యారేజీలో వందేమాతరం గీత రచనకు 150 ఏళ్లు నిండిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులు వందేమాతరం గీతాన్ని బృందగానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ షమీమ్ మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలితంగానే అఖండ భారతావనికి స్వేచ్ఛ లభించిందన్నారు. ప్రతి ఒక్కరం హక్కులను అనుభవించడంతో పాటు బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించా లన్నారు. కావలి డిపో మేనేజరు డీ. ఆదినారాయణ స్వాతంత్ర్యోద్యమంలో బకింగ్‌చంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గీతం ఎంతో ప్రభావం చూపిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ఎం కల్పన, బస్‌స్టేషన్ మేనేజరు ఎం రామక్రిష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ మల్లికార్జున వివిధ ఉద్యోగసంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరు : వందేమాతరం గీతాన్ని ప్రతీ ఒక్కరూ ఆలపించి దేశభక్తిని చాటాలని ఎంపీడీఓ రజనీకాంత్ పిలుపునిచ్చారు. బంకింగ్ చంద్ర చటర్జీ వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండలాధికారులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుండి పాతబస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రవీణ్ కుమార్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, డీడీఓ వరప్రసాద్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అల్లూరులో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న అధికారులు

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


ఉలవపాడులో సూపర్ లగ్జరీ బస్సుల స్టాపింగ్‌పై స్థానికులను అడిగి తెలుసుకుంటున్న డీపీటీవో షమీం

ఉలవపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు డిపిటిఓ షమీం సూచించారు. మండల కేంద్రమైన ఉలవపాడు ఆర్టీసీ బస్టాండును డిపిటిఓ శుక్రవారం సందర్శించారు. సూపర్‌లగ్జరీ బస్సులు ఆగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌లగ్జరీ బస్సులు అన్నింటికీ ఉలవపాడు స్టేజీ ఇచ్చినట్లు, ప్రతి గంటకు ఉలవపాడు నుంచి విజయవాడ, నెల్లూరు వెళ్లటకు సూపర్‌లగ్జరీ బస్సులకు స్టేజీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిపిటిఓ కోరారు. ఈ కార్యక్రమంలో డిఎం ఆదినారాయణ, సిఐ కల్పనా, ఎస్టీఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు : పలువురికి గాయాలు


మాలకొండ వద్ద జాతీయ రహదారి మార్జిన్ దిగి పొలాల్లోకి వెళ్లిన కారు

వలేటివారిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు పొల్లాల్లోకి దూసుకెళ్లడంతో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మాలకొండ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పామూరు నుంచి కందుకూరు వైపు వెళ్తున్న కారు మాలకొండ సమీపంలో నేషనల్ హైవే రోడ్డు మార్జిన్ దిగి పొల్లాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న పలువురికి తీవ్ర గాయాలైనట్లు అటువైపు వెళ్తున్న వాహనదారులు తెలిపారు. గాయపడిన వారు ప్రయివేట్ వాహనంలో ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిసింది.

మెట్ల మార్గం విస్తరించాలని వినతి


మాలకొండలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లే మెట్లమార్గంలో భక్తుల రద్దీ

వలేటివారిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలో మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి దర్శనం అనంతరం మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వెళ్లే మెట్ల మార్గం విస్తరణకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. అమ్మవారి దర్శనానికి వెళ్లేందుకు, దర్శనం అనంతరం తిరిగి వచ్చేందుకు ఒకే మెట్లమార్గం అయినందున భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్శనానికి వెళ్లేందుకు, దర్శనం అనంతరం తిరిగి వచ్చేందుకు వేర్వేరు క్యూ లైన్‌లు లేవు. ప్రమాదవశాత్తు తొక్కిసలాట జరిగితే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. అంతేగాకుండా మెట్లు సక్రమంగా లేకపోవడంతో నడిచే సమయంలో భక్తులు పడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు అమ్మవారి మెట్లమార్గాన్ని విస్తరించి అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

'ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన' కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కావలి ఆర్యవైశ్యసంఘం కార్తీక వనసమారాధన కార్యక్రమం కరపత్రాన్ని శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తన నివాసంలో ఆర్యవైశ్యసంఘ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 16వ తేదీన బోగోలు మండలం ముంగమూరు క్రాస్‌రోడ్డు వద్ద వనమిత్ర ప్రాంగణంలో జరిగే కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆర్యవైశ్యనేతలు ఎమ్మెల్యేని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, సంఘం నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని మద్దూరుపాడు, చెన్నాయపాలెం, తుమ్మలపెంట, అన్నగారిపాలెం, ముసునూరు -1, 2 సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

అల్లూరు : మండలంలోని నార్తుమోపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గ్రామాల్లో విద్యుత్ ఉండదని ఆయన కోరారు.

మాలేపాటి కుటుంబానికి వంటేరు పరామర్శ


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు తదితరులు

కావలి(దగదర్తి), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివంగత మాలేపాటి కుటుంబాన్ని దగదర్తిలోని వారి నివాసంలో శుక్రవారం కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి, ఆయన సతీమణి ఇందిరమ్మ, కుమారుడు వంశీ క్రిష్ణలు పరామర్శించారు. సుబ్బానాయు డు, ఆయన సోదరుడి కుమారుడు బానుచందర్‌లు ఇటీవల మృతి చెందిన విషయం తెలసిందే. దీంతో వారిద్దరి చిత్ర పటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించా రు. టీడీపీ ఆవిర్భావం నుంచి మాలేపాటి పార్టీకోసం అంకిత భావంతో పనిచేశారన్నారు.

వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వాసు

కావలి (టౌన్) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తటవర్తి వాసు నియమితులయ్యారు. శుక్రవారం విజయవాడలో జరిగిన కా ర్యక్రమంలో ఐఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు చే తుల మీదుగా వాసు నియామక పత్రం అందుకున్నారు.


నియామకపత్రం అందుకుంటున్న వాసు

టీఆర్ఆర్‌లో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టీఆర్ఆర్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సెట్‌నెల్ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో జిల్లా యువజన సంక్షేమశాఖ అనుబంధ సెట్‌నెల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్‌నెల్ సీఈఓ నాగేశ్వరరావు వ్యక్తిత్వ వికాసంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా యూత్ ఫెస్టివల్‌లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ, సెట్‌నెల్ మేనేజరు బి. శ్రీనివాసరావు, గయాజ్ అహ్మద్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

భర్తపై భార్య బంధువుల దాడి

కావలి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం కనమళ్ల గ్రామానికి చెందిన తన్నీరు కోటేష్‌పై భార్య బంధువులు దాడి చేశారు.ఈ సంఘటన కావలి మద్దూరుపాడు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు, కనమళ్ల గ్రామానికి చెందిన కోటేష్ ఆదే గ్రామానికి చెందిన రాయి దీపికను రెండు నెలల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకుని శింగరాయకొండలోని పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరు మేజర్లు కావటంతో ఇరుకుటుంబాలను పిలిపించిన పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. హైదరాబాద్‌లో సోలార్ ఫెన్సింగ్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్న కోటేష్ భార్య దీపికతో హైదరాబాద్‌లో కాపురం పెట్టాడు. కోటేష్‌పై గతంలో పోక్సో కేసు ఉండటం తో వాయిదా కోసం ఉదయం ఒంగోలు కోర్టుకు వచ్చాడు. అనంతరం కనమళ్ల నుంచి కావలిలో స్నేహితునికి మోటారు సైకిల్ ఇచ్చివెళ్లేందుకు కోటేష్ అతని స్నేహితులైన సీతారాం, సత్యన్నారాయణతో కలిసి మోటారు సైకిల్ పై కావలి బయలు దేరాడు. మార్గమధ్యంలోని మద్దూరుపాడు సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపంలో భార్య దీపిక తండ్రి మారుతి, ఆయన కుమారుడు ముఖేష్, అయ్యప్ప మాలలో ఉన్న వారి బంధువులు మరో ఐదుగురు మోటారు బైక్‌ను ఆపి బీరు బాటిల్, కర్రతో దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో కోటేష్‌కు, ఆయన స్నేహితుడు సీతారాంకు గాయాలు కాగా, కోటేష్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వన్‌టౌన్ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే...!

● శిథిలావస్థలో పెంట్రాల యూపీ పాఠశాల

లింగసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాలలోని ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే పాఠశాలలోని మూడు తరగతి గదులు ఉరుస్తున్నా యి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలోని ఓ తరగతి గదిలో స్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. దీంతో స్లాబు పెచ్చులు విద్యార్థులపై పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మరో రెండు తరగతి గదుల గోడలు నెర్రెలిచ్చి వర్షం కురిసినప్పుడు నీరు తరగతి గదిలోకి వస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనాలు కట్టి సుమారు 40 సంవత్సరాలకు పైగా అయ్యిందని గ్రామ మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య తదితరులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని, భవనాలకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.


శ్లాబు పెచ్చులూడిన యూపీ పాఠశాల

తేరుకోని కళత్తూరు

● ముంపుగ్రామాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు



కళత్తూరులో మురుగునీటిలోనే సామాన్లు శుభ్రం చేస్తున్న బాధితులు



బాధితులకు సాయం అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, ఆదిమూలం, టీడీపీ నేతలు

కేవీబీపురం/సత్యవేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జల ప్రళయం సృష్టించిన బీభత్సం నుంచి కళత్తూరు దళితవాడవాసులు ఇంకా తేరుకోలేదు. ఇళ్లల్లో బురద పేరుకుపోయి కొందరు, ధాన్యం, సామగ్రి పాడై మరికొందరు, దుస్తులు కొట్టుకుపోయి ఇంకొందరు.. ఇలా వీరి పరిస్థితి దైన్యంగా మారింది. ఒకవైపు సహాయక చర్యలు జరుగుతుంటే.. మరోవైపు సర్వం కోల్పోయిన బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కేవీబీపురం మండలం పాతపాళెం రాయల చెరువు గురువారం ఉదయం తెగడంతో పాతపాళెం దళితవాడ, అరుంధతివాడ, ఓళ్లూరు దళితవాడ, కళత్తూరు దళితవాడల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా ప్రాంతాల్లో శుక్రవారం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. నారాయణవనం, పిచ్చాటూరు, వరదయ్యపాళెం, సత్యవేడు, వడమాలపేట పంచాయతీలు.. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ.. తిరుపతి కార్పొరేషన్ నుంచి 200 మందికిపైగా పారిశుధ్య సిబ్బంది.. శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, తిరుపతి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో వీధుల్లో, ఇళ్లల్లో పేరుకుపోయిన బురద తొలగిస్తున్నారు. బురద తీసేందుకు 10 ఎక్స్‌కవేటర్లు వినియోగిస్తున్నారు. ఇళ్లల్లో బురద తీసేవరకు వండుకునే పరిస్థితిలేదు. ఇప్పటికే బురద వల్ల ఇళ్లల్లో దుర్వాసన వస్తోంది. బురదను, దుస్తులు, సామాన్లను కాలువల్లో పారుతున్న నీటితోనే మహిళలు శుభ్రం చేసుకుంటున్నారు. కచ్చా.. రేకుల ఇళ్లల్లో తేమ తగ్గాలంటే వారం రోజులు పట్టొచ్చు. అంటువ్యాధులు ప్రబలకుండా శ్రీకాళహస్తి, కేవీబీ పురం ప్రాంతాల నుంచి వైద్య సిబ్బంది గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు అందిస్తున్నారు. ఇక, పశువుల కళేబరాలను ట్రాక్టర్లలో తరలిస్తుంటే రైతులు కుమిలిపోతున్నారు. ముంపునకు గురైన ఈ ప్రాంతాలు తేరుకుని సాధారణ స్థితికి రావాలంటే మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది.





గ్రామంలో పారిశుధ్య చర్యలు - తడిసిన పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న దృశ్యం

బాధితులకు సాయం

ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు నూనె, పంచదార, కందిపప్పు, చింతపండు, ఉల్లిపాయలు, బంగాళదుంపలతో పాటు రూ.3వేలను అందిస్తున్నారు. పాతపాళెం, అరుంధతివాడ, ఎస్ఎల్‌పురం గ్రామాల్లో ఈ సహాయక చర్యలు చేపట్టామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. 457 పశువులు కొట్టుకుపోగా, 26 ఆవులు, 18 గేదెలు, 13 మేకలు చనిపోయాయని పశువైద్యులు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యేలు ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ గ్రామంలో పర్యటించారు. అన్ని విధాలా బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదిమూలం రెండు రోజులుగా కళత్తూరు, పాతపాళెం గ్రామాల్లోనే మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డీపీవో సుశీలాదేవి, డీఎల్‌డీవో సుస్మిత, డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డీడీ విక్రమ్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు చంద్రశేఖర్‌రావు, ఆశీర్వాదం, కేవీబీ పురం, పిచ్చాటూరు, పరిసర మండలాల అధికారులు గ్రామంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

పంట పెట్టేదెలా?

వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. రాళ్లు చేరాయి. చాలా వరకు కోతకు గురయ్యాయి. ఈ సీజన్‌లో రైతులు పంటలు పెట్టుకునే పరిస్థితి లేదు. ఇసుక మేట తొలగించి.. సాగుకు వీలుగా మార్చుకొనేందుకు సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు నిండు కుండలా ఉన్న రాయలచెరువులో చుక్కనీరు కూడా లేదు. ఈ కట్ట బాగై.. నీళ్లుచేరి సాగుకు అందేది ఎప్పుడోనని ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.

పొలాల్లో ఇసుక మేటలు



అన్నివిధాలా ఆదుకుంటాం

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం హామీ ఇచ్చారు. ప్రతి గేదెకు రూ.50వేలు, ఆవుకు రూ.40వేలు, మేకలు, గొర్రెలకు రూ.7,500 చొప్పున పరిహారం.. ఇళ్లల్లో బురద శుభ్రం చేసుకోవడానికి తక్షణం రూ.10వేలు చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. ఇల్లు కూలిపోయినట్లయితే పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. పత్రాలు, సర్టిఫికెట్లు పోతే.. మళ్లీ ఇచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇళ్లలో దెబ్బతిన్న ఉపకరణాల వివరాలను సేకరించి ప్రతి ఒక్కరికీ నష్టం లేకుండా ప్రభుత్వం సాయం చేస్తున్నారు. మూడు రోజులు పునరావాసంలో ఉండవచ్చని సూచించారు.

మట్టి బలహీనతతో ప్రమాదం

'చెరువు బండ్ కింద మట్టి బలహీనంగా ఉంది. దీంతో గ్రాడ్యువల్ సాయిల్ సీపేజి ఏర్పడి నీళ్లు బండ్ పైకి చేరడంతో ప్రమాదం ఏర్పడింది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఓళ్లూరు రాయలచెరువును శుక్రవారం ఆయన పరిశీలించి, గండి పడిన కారణాలపై ఆరా తీశారు. 'ఉదయం 5 గంటల సమయంలో చేపలు పడుతున్న గ్రామస్తులు నీటిలో బురద కలుస్తున్నట్లు గమనించి సర్పంచి, ఉప సర్పంచికి సమాచారం ఇచ్చారు. వారు 6.30 గంటల సమయంలో చేరుకునే సరికి నీరు బండ్ మీదుగా ప్రవహిస్తోంది. వెంటనే ఇరిగేషన్ అధికారులు యంత్రాలు తెచ్చినా, నీటి ఫోర్స్ చాలా ఎక్కువగా ఉండడంతో కట్టను కాపాడలేకపోయారు. మొత్తం కట్ట తెగిపోయి, కింద గ్రామాలపైకి ఉప్పెనగా నీళ్లు వచ్చి చేరింది' అని కలెక్టర్ వివరించారు. త్వరలోనే చెరువు కట్టను శాశ్వతంగా పూడ్చించే ప్రతిపాదనలు, కొలతలు సేకరించామన్నారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాయలచెరువు ఘటనలో ఏఈ సస్పెన్షన్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళ్లూరు రాయలచెరువుకు గండి పడిన ఘటనలో ఇరిగేషన్ ఏఈ బాబును సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. చెరువుకు గండిపడకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈ చర్యలు చేపట్టారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

పంటలకు పరిహారం పెంపు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దెబ్బతినే పంటలకు పరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంతో పోల్చితే ఆయా పంటలకు రూ.8వేల నుంచి రూ.15వేల వరకు అదనపు పరిహారం అందనుందని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు శుక్రవారం తెలిపారు.



పంట	పరిహారం (రూపాయల్లో)	
(హెక్టార్లలో)	గతం	ప్రస్తుతం
వరి	17వేలు	25వేలు
వేరుశెనగ	17వేలు	25వేలు
అరటి	25వేలు	30వేలు
మిరప	17వేలు	35వేలు
బొప్పాయి	17వేలు	25వేలు
కూరగాయలు	17వేలు	25వేలు
పసుపు	17వేలు	35వేలు
చెరకు	17వేలు	25వేలు
నువ్వులు	8,500	15వేలు
మినుములు	10వేలు	15వేలు

వందేమాతరం



నెరబైలు మోడల్ ప్రైమరీ పాఠశాలలో 150 ఆకారంలో విద్యార్థులు

● 150 ఏళ్ల సందర్భంగా మార్మోగిన నినాదం

శుక్రవారం ఉదయం పది గంటలకు.. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 'వందేమాతరం' నినాదం మార్మోగింది. 150 ఏళ్లయిన సందర్భంగా వందేమాతరం గేయాలాపన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

ఎస్వీయూలో చిరుత సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో మళ్లీ చిరుత సంచరించిన ఆనవాళ్లు కనిపించాయి. గురువారం రాత్రి పాపులేషన్ స్టడీస్- ఐ బ్లాక్ హాస్టల్ మధ్య కొత్త భవన నిర్మాణ ప్రాంతంలో కుక్కను తరిమిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో బయట సంచరించరాదని సూచించారు.

సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం →



● ఆయకట్టు భూములకు

'గ్రామకంఠం'గా రిజిస్ట్రేషన్లు

తనిఖీల్లో ఏసీబీ అధికారుల గుర్తింపు

రేణిగుంట నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మూడు రోజులుగా జరుపుతున్న తనిఖీల్లో కీలక డాక్యుమెంట్లను గుర్తించారు. గురువారం ఉదయం చేపట్టిన తనిఖీలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. నిషేధిత జాబితా, దేవదాయ శాఖల భూములు, డబుల్ రిజిస్ట్రేషన్లు 150 వరకు జరిగినట్లు గుర్తించారు. ఇక శుక్రవారం ఉదయం స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా శ్రీకాళహస్తి సమీపంలోని ఓ చెరువు ఆయకట్టు 16 ఎకరాలు ఉండగా అందులోని ఒకే సర్వే నెంబర్‌కు గ్రామ కంఠాలుగా చిత్రీకరించి 200 పైచిలుకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించారని సమాచారం. ముఖ్యంగా తిరుపతి-రేణిగుంట మార్గంలోని ఓ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వైఎస్ వ్యక్తిగత అనుచరుడి భూమిని గతంలో విక్రయ రిజిస్ట్రేషన్ చేశారు. అదే భూమిని మరొకరికి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డి హయాంలో రిజిస్ట్రేషన్ చేయడాన్ని గుర్తించారు. ఇక ఆనందరెడ్డి వ్యక్తిగత అనుచరుడి వద్ద దొరికిన బ్యాగులోని డాక్యుమెంట్ల ఆధారంగా సూరప్పకశంలో 12 ఎకరాలు, దామినేడులో 3 ఎకరాలు, గాజులమండ్యంలో 34 ఎకరాలు, తిమ్మినాయుడుపాళెంలో 2 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసినట్టు గుర్తించారని తెలిసింది. ఈ భూములు ఎవరి పేరుతో రిజిస్ట్రేషన్ అయ్యిందో, ఆ పత్రాలను వ్యక్తిగత అనుచరుడు ఎందుకు దాచి పెట్టాడనేది ఏసీబీ విచారణలో వెలుగులోకి రావాల్సి ఉంది. మూడు రోజులు జరిగిన ఏసీబీ తనిఖీల్లో గుర్తించిన పత్రాల ప్రొసీడింగులను సిద్ధం చేసే పనిలో ఏసీబీ అధికారులు ఉన్నట్టు సమాచారం.

ఎస్వీయూ కృషిలో విజన్-2047 ప్రతిఫలిస్తోంది

● నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్

డాక్టర్ వీకే సారస్వత్‌ను సత్కరిస్తున్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ వీసీలు నరసింగరావు, ఉమ →



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కృషిలో విజన్-2047 ప్రతిఫలిస్తోందని నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ పేర్కొన్నారు. ఎస్వీయూ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ సంయుక్తంగా శుక్రవారం సెనెట్ హాలులో చేపట్టిన కార్యక్రమంలో 'పరిశోధనావిష్కరణలు- ద విజన్ ఆఫ్ వికసిత భారత్' అంశంపై ఆయన ప్రసంగించారు. 2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి ఒక ఆకర్షణీయమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకుందన్నారు. దీనికి అవసరమైన కృషిని దేశంలోని అన్ని సంస్థలు, పౌరులు నెరవేర్చాల్సి ఉందన్నారు. తదనుగుణంగా ఆయా సంస్థలు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కోరారు. అంతరిక్షంలో శాస్త్రీయ సాంకేతిక నాయకత్వం, కృత్రిమ మేధ, బయోటెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పునరుత్పాదక శక్తి, వాతావరణ చర్యతో సహా స్థిరత్వం, గ్రీన్ గ్రోత్, ట్రిలియన్ డాలర్ల డిజిటల్ మార్కెట్‌ను ముందుకు నడిపించే ఏఐ ఆధారిత స్టార్టప్‌లు, డిజిటల్ ఎకానమీ, శక్తిమంతమైన విశ్వవిద్యాలయాల పరిశోధనలు, పేటెంట్లు, యువత నేతృత్వంలో జరిగిన ఆవిష్కరణల వంటివి వికసిత భారత్ లక్ష్యాన్ని నెరవేర్చడానికి దోహదం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. నాణ్యమైన పరిశోధనలు మంచి ఉపాధి అవకాశాలను కూడా సృష్టించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకుల సందేహాలను డాక్టర్ వీకే సారస్వత్ నివృత్తి చేశారు. ఇంక్యుబేషన్ పరిశ్రమ భాగస్వామ్యాలను ఎస్వీయూ విస్తరిస్తున్నట్లు వీసీ నరసింగరావు చెప్పారు. పేటెంట్లు, ప్రోటోటైప్‌లు, స్టార్టప్‌లలో ముగియబోతున్న ప్రాజెక్టులను కొనసాగించడానికి ప్రోత్సహిస్తుందన్నారు. ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలలో స్కాలర్‌షిప్‌లు, మార్గదర్శకత్వం అనుకూలమైన వాతావరణం మెరుగు పడ్డాయని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ తెలిపారు. మన దేశం అంతరిక్ష, బయోటెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, పునరుత్పాదక శక్తి , సెమీకండక్టర్లు వంటి రంగాలలో పురోగతిని సాధించిందని సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ కార్యదర్శి నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చెంగ్రాయుడు, మాజీ వీసీ మురళి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

తిరుపతి(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శుక్రవారం జరిగాయి. డీఈవో ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. 10 విభాగాల్లో 450 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన 30 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ వృత్తి విద్య ఉపాధికి పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి వేదికలు ఉపయోగకరమన్నారు. సిమాట్ డైరెక్టర్ మస్తానయ్య మాట్లాడుతూ విద్యార్థులు అభ్యసనంతోపాటు నైపుణ్యాలను సాధించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉప విద్యాశాఖాధికారి ఇందిరాదేవి, బాలల సంక్షేమ, అభివృద్ధి అధికారి పుష్ప, సీఎంవో జి. సురేష్, ఏఎంవో, ఇతర సెక్టోరియల్ అధికారులు, వృత్తివిద్య కోఆర్డినేటర్లు, 90 మంది వృత్తి విద్య శిక్షకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో స్కిల్ కాంపిటీషన్‌ను ప్రారంభిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్

శ్రీవారిసేవలో ప్రముఖులు



నీలం సాహ్ని - దివి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ, సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ నవీన్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సినీనటి దివి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

'మిట్స్'లో 5,6 తేదీల్లో
పాలిటెక్నిక్ అధ్యాపకుల జాతీయసదస్సు

పోస్టర్ ఆవిష్కరించిన ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా

తిరుపతి(విద్య), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని మిట్స్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో డిసెంబరు 5, 6 తేదీలలో దేశవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులకు అవుట్‌కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్‌పై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సంబంధించి పోస్టర్లను శుక్రవారం తిరుపతిలోని సాంకేతికవిద్య కార్యాలయంలో ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్, మిట్స్ ప్రతినిధులు జి.శ్రీనివాసులు, కేఎండీ రియాజ్ అలీ ఆవిష్కరించారు. పాలిటెక్నిక్‌లలో ఆఫర్ చేస్తున్న కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) ఎంతో ప్రధానమని ఆర్జేడీ చెప్పారు. ఇందులో భాగంగా అవుట్ కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్‌పై అధ్యాపకులకు అవగాహన పెంచేందుకు ఈసదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. బోధనలో నాణ్యత పెంపు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. దీన్ని అధ్యాపకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,718


తలనీలాలు సమర్పించినవారు: 21,937

హస్తకళావిలాసం
గాంధీ శిల్పబజార్

● శిల్పారామంలో 9 దాకానే



తిరుపతి శిల్పారామంలో దేశంలోని విభిన్న హస్తకళలు కొలువుతీరాయి. కళాకారులే స్వయంగా ఇక్కడ తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. 'గాంధీ శిల్ప బజార్ 2025' పేరుతో ఈ నెల 4న తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఈ ప్రదర్శన ప్రారంభం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం, కళా సృష్టి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 దాకా ఈ ప్రదర్శన ఉంటుంది. ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు సందర్శించవచ్చని శిల్పారామం ఏవో సుధాకర్ తెలిపారు. అరుదైన ఎన్నో కళాకృతులు ఇక్కడ లభిస్తున్నాయి. కొన్ని స్టాల్స్‌లో కళాకారులు స్వయంగా తమ ఉత్పత్తులను తయారు చేస్తూ కనిపిస్తారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో మాట్లాడే అరుదైన అవకాశం ఇక్కడికి వెళ్తే లభిస్తుంది.



- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



పుదుచ్చేరి ప్రత్యేకం



పుదిచ్చేరికి చెందిన రాహుల్ కుటుంబం గడచిన 40 ఏళ్లగా కొబ్బరిచెట్టు నుంచి వివిధ కళాకృతులను తయారు చేస్తోంది. కొబ్బరి చిప్పలతో లైటింగ్ ల్యాంప్స్, పిల్లల ఆట వస్తువులు ఈ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

కాశ్మీర్ చీరలు



గాంధీ శిల్పబజార్‌లో కాశ్మీరీ శారీస్ విస్తృతంగా అమ్ముడు పోతున్నాయి. కాశ్మీర్‌కు చెందిన సఫత్ హుస్సేన్ కుటుంబం గడచిన కొన్ని తరాలుగా ప్రత్యేక ఊలుతో చీరలు తయారు చేసి విక్రయిస్తోంది. చాలా అందమైన డిజైన్లలో ఇవి లభిస్తున్నాయి. ధరలు రూ.2వేలు నుంచి రూ.లక్ష వరకు ఉన్నాయి.







మహాబలిపురం ముత్యాలు



మహాబలిపురంకి చెందిన కళాకారుడు కృష్ణన్ స్టాల్‌లో సముద్రంలో సహజసిద్ధంగా దొరికే ఆలుచిప్పలు, ముత్యాలు, పగడాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఒరిజనల్ ముత్యాలు, పగడాలు విక్రయించడం వీరి ప్రత్యేకత. పలు ఆభరణాలు ఉన్నాయి. ఇక చిన్న చిన్న రాతి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఎల్లప్ప టెర్రకోట బొమ్మలు



పలమనేరుకు చెందిన ఎల్లప్ప మట్టితో తయారుచేసిన 500 రకాల టెర్రకోట బొమ్మలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. రకరకాల బొమ్మలు, వాటర్ బాటిల్స్ దీపాలు వంటి మట్టి కళాఖండాలు ఇక్కడ ఉన్నాయి. టెర్రకోట కళాకారుడు ఎల్లప్పకు గతంలో జాతీయ అవార్డు కూడా లభించింది.





● ధర్మవరంకు చెందిన జనార్ధన్ కుటుంబం తయారు చేస్తున్న లెదర్‌పెయింట్స్, డోర్ హ్యాంగిల్స్ లైటింగ్ ల్యాంప్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

● దేవదారుచెక్కతో వంట సామాగ్రి, వెదురుతో చేసి నీళ్ల గ్లాసులు, టీకప్పులు ఇక్కడ లభిస్తున్నాయి.

● పెన్ కలంకారీకి మన శ్రీకాళహస్తి ప్రసిద్ధి అయితే, బ్లాక్ ప్రింటింగ్‌కి పెడన ప్రత్యేకం. పెడనకకు చెందిన జీవన కుమార్ బ్లాక్ ప్రింటింగ్‌లోని కలంకారీ షర్ట్స్, చీరలు, చున్నీలు విక్రయిస్తున్నారు.









తెల్లజిల్లేడుతో వినాయక విగ్రహాలు

తెల్లజిల్లేడుతో తయారుచేసిన వినాయక బొమ్మలకు మార్కెట్‌లో బహు గిరాకీ ఉంది. జీడీనెల్లూరుకు చెందిన త్యాగరాజులు 20 ఏళ్లగా తెల్లజిల్లేడుతో వినాయక ప్రతిమలను రూపొందించడంలో దిట్ట. ఈ స్టాల్‌లో రూ.120 నుంచి తెల్లజిల్లేడు విగ్రహాలను విక్రయిస్తున్నారు. తెల్లజిల్లేడుతో చేసిన కీచైన్స్ ఆకట్టుకుంటున్నాయి.









ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.6 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఎస్.గుణశేఖర్ 2016లో నాగపట్ల ఈస్ట్ బీట్, చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించింది. తర్వాత బెయిల్‌పై ఇతడు బయటకు వచ్చాడు. గత తొమ్మిది సంవత్సరాలుగా వివిధ దశల్లో విచారణలో ఉన్న కేసును రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేశారు. ఏడాదిపాటు విచారణ జరిగింది. గుణశేఖర్‌పై సాక్ష్యాధారాలు నిరూపణ కావడంతో ప్రాసిక్యూషన్ వాదనలు విన్న తర్వాత నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అనంతరం నిందితుడ్ని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ప్రజాప్రతినిధుల పీఆర్వోలు టికెట్లు అమ్ముకుంటున్నారు

● డయల్ యువర్ ఈవోలో భక్తుడి ఫిర్యాదు


డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పాల్గొన్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అధికారులు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొంతమంది ప్రజాప్రతినిధుల పీఆర్వోలు అధిక ధరలకు వీఐపీ బ్రేక్ దర్శనాలను అమ్ముకుంటున్నారని ఈశ్వర్(అనంతపురం) అనే భక్తుడు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫిర్యాదు చేశారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం పలువురు భక్తులు ఈవోతో ఫోన్‌లో సంభాషించారు. ఈ సమయంలో ఈశ్వర్ మాట్లాడుతూ ఒక టికెట్‌ను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అమ్ముతున్నారని చెప్పారు. ఇటువంటి వారిని కట్టడి చేయలని కోరారు. దళారీలపై ఫిర్యాదులు వస్తున్నాయని,విజిలెన్స్ విభాగం చర్యలు తీసుకుంటోందని ఈవో సమాధానం ఇచ్చారు. భక్తులు కూడా దళారీలను ఆశ్రయించకుండా టీటీడీ అధికారిక వెబ్‌సైట్, కౌంటర్ల ద్వారానే టికెట్లు, టోకెన్లు పొందాలని సూచించారు.

డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 17 మంది భక్తులు ఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. దర్శన సమయంలో ఆలయంలోని శ్రీవారిసేవకులు లాగేస్తున్నారని, దర్శన టికెట్ల బుకింగ్ సమయంలో ఓటీపీ ఆలస్యంగా వస్తోందని మణికంఠ(అనంతపురం) ఫిర్యాదు చేశారు. ఓటీపీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అలాగే భక్తులతో మెలిగే విధానంపై శ్రీవారిసేవకులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామని ఈవో బదులిచ్చారు. 2023లో ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఎలాంటి నియామకాలు జరగలేదని గణేష్(కడప) ఈవో దృష్టికి తీసుకురాగా, 15 రోజుల్లోనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు, వృద్ధులకు ఆఫ్‌లైన్‌లోనూ టోకెన్లు కేటాయిస్తామని బోర్డు ప్రకటించినప్పటికీ చర్యలు తీసుకోలేదని జగన్(జగిత్యాల) తెలుపగా, భక్తుల అభిప్రాయ సేకరణ, కమిటీ సిఫార్సుల మేరకు త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటామని ఈవో అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి ప్రముఖుల సూచనలను దృష్టిలో పెట్టుకుని వీఐపీలు ఏడాదిలో కొన్ని సార్లు మాత్రమే దర్శనం చేసుకునేలా చూడాలని మునిలక్ష్మి(తిరుపతి) కోరారు.

బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడింగ్ సమస్య

దర్శన టికెట్లు, టోకెన్ల బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడ్ చేసేలోపు కోటా పూర్తయిపోతోందని హరిణి అనే భక్తురాలి ఫిర్యాదుపై ఈవో బదులిస్తూ.., బుకింగ్ సమయంలో మళ్లీ ఆధార్ అప్‌లోడ్ చేసే అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పేమెంట్ సమయంలో క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయోగించే అవసరం లేకుండా ఆర్బీఐ సూచించిన యూపీఐ, వ్యాలెట్ ద్వారా చెల్లించే అంశాలను కూడా ఐటీ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని తిక్కవరం గ్రామానికి చెందిన వీరరాఘవయ్య ఆస్తి వివాదాల నేపథ్యంలో తన బావమరిది భార్య వెంకటలక్ష్మిపై 2017లో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువుకావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు.



● చిత్తూరులో జోయాలుక్కాస్

బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో

ప్రముఖ జోయాలుక్కాస్ సంస్థ చిత్తూరులో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో వినియోగదారులతో పాటు ఏఎస్పీ రాజశేఖర్ రాజ్, నటి దివి వాడ్యా, రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్, రీజనల్ మేనేజరు శ్రీజేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో రూ.72 లక్షల రుణాలు

● జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు సింగిల్ విండో అధ్యక్షుడి ఫిర్యాదు

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తనఖా పెట్టి రూ.72 లక్షల రుణాలు పొందారని సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. '2020 మార్చి నుంచి 2025 ఆగస్టు వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆర్థిక లావాదేవీలలో అవకతవకలు జరిగాయని, ఈ నెల 4న డీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ బంగారును పరిశీలించగా అందులో వన్ గ్రాము గోల్డ్ ఆర్నమెంట్స్ ఉన్నాయని గుర్తించారు. కె.రెడ్డమ్మ, సి.రుతున్ పేర్లతో 2025 జనవరి 18, 21న, ఫిబ్రవరి 11వ తేదీలలో ఈ ఆభరణాలు పెట్టినట్లు ఉంది' అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

తిరుచానూరు వరకే మెము

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెళ్లే నాలుగు మెము రైళ్లు గురువారం నుంచి ఫిబ్రవరి 5వ తేది వరకు తిరుచానూరు వరకే నడుస్తాయి. అరక్కోణం నుంచి ఉదయం 9.15 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరు వరకే వెళ్తుంది. ఇక, సాయంత్రం 3.40 గంటలకు తిరుచానూరు నుంచే అరక్కోణం బయల్దేరుతుంది. చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 9.50 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరులోనే ఆగుతుంది. అక్కడ్నుంచే మధ్యాహ్నం 1.25 గంటలకు బయలుదేరుతుంది.

ప్రకృతి అందాల మామండూరు

● మరింత అభివృద్ధి చేస్తే పెరగనున్న సందర్శకులు

● నేడు డిప్యూటీ సీఎం పర్యటన


గుంటి మడుగు వాచ్ టవర్‌కు వెళ్లే మార్గం

రేణిగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో.. ప్రకృతి అందాల నడుమ ఉన్న మామండూరు పర్యాటక కేంద్రంలో మరిన్ని వసతులు కల్పిస్తే సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజల్లితుంది. శనివారం రేణిగుంట మండలంలోని మామండూరును సందర్శించనున్న అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ దిశగా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. సెలవు దినాల్లో 700కుపైగా.. సాధారణ రోజుల్లో 130 మంది వస్తున్నారు. ప్రస్తుతానికి 6 కాటేజీలున్నాయి. ఇక, అన్ సీజన్ అయిన ఎండా కాలంలో సందర్శకుల శాతం పెంచేందుకు రిసార్టులు, పిల్లలు ఆడుకునేలా పార్కులు ఏర్పాటు చేయాలి. వారాంతపు సెలవు దినాల్లో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శేషాచలం అటవీ ప్రాంతాల్లో అడ్వెంచర్ల కోసం వస్తుంటారు. వీరికోసం ప్రకృతి బాట నుంచి అభివృద్ధి చేస్తే ఎక్కువగా వస్తారు. ఇక, మామండూరు గెస్ట్‌హౌస్ నుంచి గుంటిమడుగు వద్ద వాచ్‌టవర్‌పై నుంచి ప్రకృతి అందాలు చూడొచ్చు. ఇక, గంటి మడుగు జలపాతంలో ఎప్పుడూ నీళ్లు ప్రవహిస్తుంటాయి. ఇక్కడికి సందర్శకులను అనుమతించడంలేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుని అనుమతించాలని కోరుతున్నారు. షికారి లైన్, వెద్దురు, మల్లేరు వంక, బ్రహ్మదేవుని గుండం, ఉడగమనుదొడ్డి బేస్ క్యాంప్ ప్రాంతాలకు రోడ్డువేసి జంగిల్ సఫారీకి అనుమతిస్తే సందర్శకులు పెరుగుతారు. శని, ఆదివారాల్లో మామండూరు గెస్ట్‌హౌస్ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తే సందర్శకులకు అనుకూలంగా ఉంటుంది. ఇలా సందర్శకులు పెరిగేలా జిల్లా అధికారుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నది పర్యాటకుల కోరిక.

పవన్ పర్యటనకు భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మూడు కార్యక్రమాలు.. తొమ్మిది గంటల పాటు సాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో నలుగురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ళు, రోప్ పార్టీలు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, రోడ్డు డిగ్గింగ్ పార్టీలు, అటవీశాఖ అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటారు. మామండూరు అటవీ ప్రాంతంలో పవన్ పర్యటన ఉండటంతో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

తిరుపతిలో గంజాయి బ్యాచ్ వీరంగం

● ఆరు కార్లు, విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ కార్యాలయ అద్దాలు ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ వీరంగం చేసింది. సింగాలగుంటలో దాదాపు ఐదారు గంటల పాటు ఆరుగురు యువకులు, విద్యార్థులు హల్‌చల్ చేశారు. కనకభూషణ లేఅవుట్‌లో ఆరు కార్ల అద్దాలు ధ్వంసం చేశారు. పక్కనే వున్న విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ కార్యాలయ కిటికీ అద్దాలు, తలుపులు ధ్వంసం చేశారు. సబ్ స్టేషన్ నైట్ షిఫ్ట్ ఆపరేటర్ రేవంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చెన్నారెడ్డి కాలనీకి చెందిన ప్రవీణ్, విఘ్నేష్, వేణు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు పదో తరగతి చదువుతున్నారు. మరొకరి వివరాలు తెలియదు. స్నేహితులైన వీరికి మూడు నెలల క్రితం కొంతమంది ప్రత్యర్థులతో గొడవ జరిగింది. దీంతో వారిని టార్గెట్‌గా చేసుకుని కొద్ది రోజులుగా వీరు కనకభూషణ లేఅవుట్‌లో మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. కొందరు స్థానికులు వీరిని మందలించారు. మళ్లీ గురువారం రాత్రి గంజాయి, మద్యం తాగి.. బీరు బాటిళ్లతో నడి రోడ్డుపై బీభత్సం సృష్టించారు. సబ్‌స్టేషన్ కార్యాలయంపై దాడి చేసి తలుపులు, కిటికీల అద్దాలు పగలకొట్టారు. రోడ్లపై ఆపి వున్న ఆరు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. దీనిపై డయల్ 112కు కొందరు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు ఎస్ఐలు లోకేషబాబు, అజిత, బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుల కోసం రెండు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.




భారత కీర్తిని ప్రపంచానికి చాటిన హాకీ: పాశం



హాకీ లోగో, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడ మనదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మనదేశంలో హాకీ పోటీలు ప్రారంభమై వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం గూడూరు క్లబ్ ఆధ్వర్యంలో లోగో, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత క్రీడా చరిత్రలో హాకీ ప్రత్యేక స్థానం ఉందన్నారు. 1925లో భారత హాకీ ప్రయాణం మొదలై నేటికి శతాబ్దం పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. 1928లో ఒలంపిక్స్‌లో తొలి స్వర్ణపతకాన్ని సాధించిన ధ్యాన్‌చంద్ ప్రపంచవ్యాప్తంగా భారత హాకీకి గౌరవం తీసుకువచ్చారన్నారు. గూడూరు నుంచి ఎంతో మంది హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దీపక్ ఆకాశ్, స్పర్జన్‌రాజ్, అబ్రహం, వెంకటేశ్వర్లురాజు, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, పెనుబోలు జానకిరామిరెడ్డి, హాకీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులు



మన్నారుపోలూరులో నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన ఏఎంసీ చైర్మన్ రమేష్ టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మగ్గం పనులు ఆగిపోయి జీవనోపాధి కోల్పోయిన చేనేత కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం మన్నారుపోలూరులో చేనేత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేతలను ఆదుకునేందుకు ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, తహసీల్దారు గోపీనాథ్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, టీడీపీ నాయకులు సురేష్ నాయుడు, అలవల శ్రీనివాసులు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి గాయత్రి

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ సమానంగా న్యాయం అందించడమే న్యాయసేవా దినోత్సవ ప్రధాన లక్ష్యమని న్యాయమూర్తి గాయత్రి అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హక్కులు, పేదలకు ఉచిత న్యాయసేవలు అందించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమాశంకర్, కోటేశ్వరరావు, మెహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌కు సన్మానం



చెంచురామయ్యను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లయన్స్‌క్లబ్ సభ్యుడు సోమిశెట్టి చెంచురామయ్యను క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్న చెంచురామయ్య ఏఎంసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం హర్షణీయమన్నారు. స్థానిక సరస్వతీ శిశుమందిరంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, రియాజ్ అహ్మద్, ఎంవీ రమణయ్య, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్‌రావు, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో దంత వైద్యశిబిరం

కోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చెందోడుకు చెందిన ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంతవైద్య శిబిరం జరిగింది. విద్యార్థులకు దంతపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, జన విజ్ఞానవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ వేణుగోపాల్, ఎంవీరావు ఫౌండేషన్ చైర్మన్ లీలామోహన్‌కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటాచలం, జన విజ్ఞానవేదిక సభ్యులు డీవీ కృష్ణయ్య, వేణుగోపాల్, రాజేంద్ర ప్రసాద్, రమేష్, సుజన పాల్గొన్నారు.

గునపాడు ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ ఫ్లాగ్ డే

చిట్టమూరు, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గునపాడు ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కౌట్స్ ఫ్లాగ్ డే నిర్వహించారు. హెచ్‌ఎం శీతారామయ్య, గునపాటిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాసౌజన్య మాట్లాడుతూ... విద్యార్థులు చిన్ననాటి నుండే దేశభక్తి పెంపొందించుకుని సేవా కార్యక్రమాల్లో పాల్గొనడానికి స్కౌట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ భరత్ మహిపతి, ఉపాధ్యాయులు పెంచలయ్య, శివప్రసాద్, రేవతి, చిన ప్రసూన, భారతి, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, జాన్సీ, శ్రీనివాసులు, ఖాదర్‌భాషా పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే విద్యపై శ్రద్ధ చూపాలి

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యార్థులు విద్యపై శ్రద్ధచూపాపి ఉత్తమ పౌరులుగా ఎదగాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక రెండో పట్టణం పరిధిలోని నరసింగరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రియాజ్‌అహ్మద్, అబ్దుల్‌రహీం, రమణయ్య, రవిచంద్రారెడ్డి, వీరేంద్రనాథ్, డాక్టర్ సుగుణమ్మ, అరుణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరుకులు

నాయుడుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట తుమ్మూరులోని గిరిజన కుటుంబాలకు జనసేన నాయకుడు అట్ల కృష్ణారావు నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సుబ్బు, అయ్యప్ప, రోహిణి, సతీష్, సిద్ధూ, వరద తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు అభినందన

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సందర్భంగా విశేష సేవలందించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకున్న తహసీల్దారు జయజయరావును శుక్రవారం మీసేవ అసోసియేషన్ నాయకులు పూలమాలలు, శాలువాలతో అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సబ్‌స్టేషన్, మండలంలోని మన్నెముత్తేరి, అట్టకానితిప్ప సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శేఖర్ తెలిపారు.

తడ: మండలం పరిధిలోని తడ, అక్కంపేట, బీవీపాళెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఈ శేఖర్ తెలిపారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.00నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ శీనయ్య తెలిపారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

గూడూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీ లేవుట్‌లో అయ్యప్పస్వామి దేవస్థానం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవంలో భాగంగా శనివారం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు భక్తులు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండదీప స్థాపన, కలశస్థాపన, పంచామృతాభిషేకం ఉంటుంది. అనంతరం స్వామివారికి పూలంగిసేవ నిర్వహించి గ్రామోత్సవం జరపనున్నట్లు భక్తులు తెలిపారు.



వర్షంలో బస్సు ఎక్కేందుకు రోడ్డుపైకి వెళుతున్న ప్రయాణికులు - అలంకారప్రాయంగా ఉన్న బస్టాండు

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండు

- రోడ్డుపైనే ఆగి వెళ్లిపోతున్న బస్సులు
- ఎండ, వానతో ప్రయాణికుల అవస్థలు

బాలాయపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బాలాయపల్లిలో ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా ఉంది. గూడూరు - వెంకటగిరి మార్గంలోని బాలాయపల్లిలో ప్రయాణికుల సౌకర్యార్థం సుమారు పాతికేళ్ల క్రితం బస్టాండు నిర్మించారు. ఈ మార్గంలో రోజుకు 40 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఒక్క బస్సు కూడా బస్టాండు ఆవరణలోకి రావడంలేదు. రోడ్డుపైనే ఆగి నేరుగా వెళ్లిపోతున్నాయి. దీంతో బస్టాండులో వేచి ఉండే ప్రయాణికులు బస్సులు ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండులో నుంచి రోడ్డుపైకి వెళ్లేసరికి బస్సులు వెళ్లిపోతుండడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. దీంతో ప్రయాణికులు రోడ్డుకు ఇరువైపులా నిరీక్షించాల్సి వస్తోంది. బస్టాండు ఉన్నా వర్షం, ఎండతో ఇబ్బందులు పడుతూ వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. రహదారి పక్కనే నిర్మించిన బస్టాండులోకి బస్సులు వెళ్లకపోవడానికి ఇబ్బంది ఏమిటోనని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. రహదారికి అనుకుని నిర్మించిన బస్టాండులోకి బస్సులు వచ్చేందుకు ఎటువంటి అడ్డంకులు లేవు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు బస్టాండు ఆవరణలోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పేదరిక రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం: కురుగొండ్ల

వెంకటగిరి, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): పేదరికం రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటలో వరద బాధిత చేనేత కార్మి కుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వం సంకల్పమన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. చేనేతలను ప్రభుత్వం అన్ని విధిలా ఆదుకుంటామన్నారు. అంతకుమందు వందేమాతర గీతాలాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు నరసింహులు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, పప్పు చంద్రమౌళి రెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, జనసేన నాయకులు రామారావు అనిల్, రాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రాయితీ రుణాలు ఇప్పిస్తామని రూ.20 లక్షల టోకరా

నాయుడుపేట టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయితీ రుణాలు ఇప్పిస్తామంటూ ఓ వ్యక్తి రూ.20 లక్షలు వసూలు చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... బాలాయపల్లికి చెందిన గురుప్రసాద్ ఓ ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్నానని చెప్పుకునేవాడు. నాయుడుపేట, వెంకటగిరి, సైదాపురం, సూళ్లూరుపేట, డక్కిలి, గూడూరు ప్రాంతాల్లో పలువురికి రాయితీ రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. 2022నుంచి 2024 వరకు పలువురి వద్ద నుంచి రూ.20 లక్షలు వసూలు చేశాడు. ఎన్నాళ్లయినా రుణాలు మంజూరు కాకపోవడంతో నాయుడుపేటకు చెందిన ఓ బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు గురుప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా, నగదు వసూలులో ఓజిలి మండలానికి చెందిన ఒక మహిళ గురుప్రసాద్‌కు సహకరించినట్లు విచారణలో తెలిసింది. గురుప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియడంతో నెల్లూరుకు చెందిన కొందరు బాధితులు నాయుడుపేట పోలీస్‌స్టేషనుకు చేరుకుని ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఉపాధి గ్రామసభలు

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడతావారిపాళెం, తిక్కవరం, వల్లిపేడు, పల్లమాల గ్రామాల్లో శుక్రవారం ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఏపీవో గిరిబాబు మాట్లాడుతూ ఉడతావారిపాళెంలో రూ.2.50 కోట్లు, తిక్కవరంలో రూ.45 లక్షలు, వల్లిపేడులో రూ.54, పల్లమాలలో రూ.45 లక్షలకు పనులను గుర్తించడం జరిగిందన్నారు. ప్రధానంగా పంట కాలువలు, ఒరవ కాలువల అభివృద్ధి, పశువుల కుంటలు, కోనేరు తవ్వకం, సిమెంటు రోడ్ల నిర్మాణం వంటి పనులను గుర్తించడం జరిగిందన్నారు.

అవి అటవీశాఖ భూములే

డక్కిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం నమశివాయపురం గ్రామంలోని సర్వే నెంబరు 1లోని 243 ఎకరాలు రిజర్వు ఫారెస్టుకు చెందిన భూములుగా నిర్ధారించడం జరిగిందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సదరు భూములు తమకు చెందినవంటూ కొందరు కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఇక మోపూరు క్రాస్ రోడ్డు సమీపంలోని జగనన్న కాలనీలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించామని తహసీల్దారు చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలల వాహనాల భద్రతపై నేడు అవగాహన సదస్సు

నాయుడుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో శనివారం ప్రైవేట్ పాఠశాలల వాహనాల భద్రతపై డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 10గంటల హాజరుకావలని కోరారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

గూడూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న సునీల్ గతేడాది సెప్టెంబరు 5వ తేదీన ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న వెంకటేశు, శ్యామ్ ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడడంతో నిందితుడికి ఏడాది జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు.

గౌనుకు నిప్పంటుకొని గాయపడిన చిన్నారి మృతి



కావ్య(ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం వెలిగించబోయి గౌనుకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని మన్నెమాల గ్రామానికి చెందిన గొట్టికాటి భగవాన్, రమాదేవి దంపతుల కుమార్తె కావ్య(3) గత శనివారం ఉదయం ప్రమిదలో ఉన్న ఒత్తిని వెలిగించబోతుండగా ప్రమాదవశాత్తు గౌనుకు నిప్పంటుకుంది. ఈ ఘటనలో చిన్నారి శరీరం కాలిపోయి తీవ్రంగా గాయపడింది. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కావ్య శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

10న లక్ష దీపోత్సవం

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఈనెల 10వ తేదీన సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు కన్యకాపరమేశ్వరి వలంటీర్ సంఘ అధ్యక్షుడు కాకి శ్రీరామ్మూర్తి తెలిపారు. బహుళ పంచమి సందర్భంగా లక్ష దీపోత్సవంలో భాగంగా శివపార్వతుల కల్యాణం జరుగుతుందని, భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అపార్ ఐడీ జనరేషన్‌పై దృష్టి పెట్టాలి

తడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులు అందరికీ అపార్ ఐడీ జనరేషన్ చేయాలని ఎంఈవో వేములు అన్నారు. శుక్రవారం చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో వందేమాతరం గీతాలాపన చేశారు. అనంతరం మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రీన్ పాస్‌పోర్టు సెల్ఫీ ఫొటో అప్‌లోడ్ చేయడం, క్యాలెండర్ ప్రకారం నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయడంపై ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మల్లికార్జునరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది - వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో పోలీసుల వందేమాతర గీతాలాపన

వందేమాతరం గేయాలాపన

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వందేమాతరం గేయాలాపన చేశారు. వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి వందేమాతరం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయుల్లో ఉద్యమ కాంక్షను వందేమాతరం గేయం రగిలించిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, ఏడుకొండలు, మధుబాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది, ఎస్‌కేఎల్‌సీఈఎఫ్ పాఠశాల విద్యార్థులతో కలసి వందేమాతరం గీతాలాపన చేశారు. ఎంఈవో నసీం ఆలీ, ఈవోపీఆర్‌డీ కిరణ్‌కుమార్, ఏవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఏపీవో విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, పట్టణాధ్యక్షుడు దయాకర్ ఆధ్వర్యంలో వందే మాతరం గీతాలాపన చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, రవీంద్రబాబు, నిరంజన్, ఇంద్రవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ గీతాకుమారి, సిబ్బంది వందేమాతర గీతాన్ని ఆలపించారు. సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి: మండల పరిధిలోని 9వ బెటాలియన్‌లో కమాండెంట్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో వందేమాతర గీతాన్ని ఆలపించారు. అలాగే పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సీఐ రమణ ఆధ్వర్యంలో వందేమాతర గీతాన్ని ఆలపించారు.

అయ్యప్ప భక్తుల కోసం 50 ప్రత్యేక రైళ్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండుచోట్ల స్టాపింగ్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణమధ్య రైల్వే ఈనెల నుంచి జనవరి వరకు 50 ప్రత్యేక రైళ్లను ఉమ్మడి నెల్లూరు జిల్లా మీదుగా నడుపనుంది. ఈ రైళ్లకు నెల్లూరు, గూడూరులో స్టాపింగ్ ఉంటుంది. ఈరైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం నుంచి కొల్లాంకు (రైలు 07101) నవంబరు 14, 21, 28, డిసెంబరు 26, జనవరి 02 తేదీల్లో, కొల్లాం నుంచి మచిలీపట్నంకు (రైలు 07102) నవంబరు 16, 23, 30, డిసెంబరు 28, జనవరి 04 తేదీల్లో, నరసాపూర్ నుంచి కొల్లాంకు (రైలు 07105) నవంబరు 16, 23, 30, డిసెంబరు 7, 14, 21, 28, జనవరి04, 11, 18 తేదీల్లో, కొల్లాం నుంచి నరసాపూర్‌కు (రైలు 07106) నవంబరు 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30,, జనవరి 06, 13, 20 తేదీల్లో, చర్లపల్లి నుంచి కొల్లాంకు (రైలు 07107) నవంబరు 17, 24, డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 05, 12, 19 తేదీల్లో, కొల్లాం నుంచి చర్లపల్లికి (రైలు 07108) నవంబరు 19, 26, డిసెంబరు 3, 10, 17, 24, 31, జనవరి 07, 14, 21 తేదీల్లో రాకపోకలు సాగిస్తాయి.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ పరిధిలోని 38 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.21.79 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ పరిధిలోని ఇప్పటి వరకు రూ.3కోట్ల వరకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఎవరైనా పేదలు వైద్యఖర్చులకు ఇబ్బందులు పడుతుంటే తమ కార్యాలయంలో సంప్రదిస్తే సీఎం సహాయనిధి నుంచి సాయం అందించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, నరసింహులు, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచు



టీడీపీలో చేఇరన వారితో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, నవంబరు, 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరు పంచాయతీ సర్పంచు పెళ్లూరు షర్మిలారెడ్డి, ఆమె భర్త, వైసీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డిలతో పాటు ఆయన అనుచరులు శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీని సర్పంచు దంపతులు గజమాలతో సత్కరించారు. కప్పగుంటకండ్రిగలోని అనిల్‌కుమార్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, పీఏసీస్ అధ్యక్షుడు కేవీ నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపి, నాయుడుపేట మండల టీడీపీ అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి, నాయకులు సన్నారెడ్డి, అక్కరపల్లి మాధవరెడ్డి, రవీంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, శాఖమూరి కృష్ణమ నాయుడు, వెంపళ్ల వెంకటేశ్వర్లు, నరేంద్రయాదవ్, వేణురెడ్డి, వేములయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరా ఆస్పత్రిలో డయాబెటిస్ హెల్త్ ప్యాకేజీ ప్రారంభం



అమరా ఆస్పత్రిలో ప్రత్యేక ప్యాకేజీ బ్రోచరును ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవిరాజు తదితరులు

రేణిగుంట నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా అమరా ఆస్పత్రిలో డయాబెటిస్ హెల్త్ ప్యాకేజీ ప్రారంభించారు. రూ.799లకే డయాబెటిస్ హెల్త్ చెకప్ ప్యాకేజీ అందుబాటులోకి తెచ్చారు. ఏపీఎస్ఏ అధ్యక్షుడు రవిరాజు, ఆర్‌ఎం ఓ అన్నాగౌరీ, డాక్టర్లు వరుణ్, లోకేష్, రమ్య, భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకారం వాయిదా

నాయుడుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకారం వాయిదా పడింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈనెల 8, 9 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల పర్యటన ఉన్నందున 9వ తేదీ జరగాల్సిన ఏఎంసీ పాలక మండలి ప్రమాణస్వీకారాన్ని ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసినట్లు చైర్మన్ ఉయ్యాల ప్రవీణ తెలిపారు.